జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 120 | మంగళవారం 23 సెప్టెంబరు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం వేగవంతంచేయాలి: సీఎం రేవంత్



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇవాళ(సోమవారం) మాట్లాడారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ భాగాలతో పాటు రేడియల్ రోడ్ల నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇందుకు అవసరమైన పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం అంశంపై సమీక్షలో చర్చించారు ముఖ్యమంత్రి. వీలైనంత త్వరగా రూట్ మ్యాప్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్– శ్రీశైలం హైవేలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా అనుమతులు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యల వివరాలను ఉన్నతాధికారులకు అందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## మరో ఎన్నికల సమరం, ముహూర్తం ఫిక్స్ - గెలుపెవరిది..!!



(సందేశం టైమ్స్): తెలంగాణలో మరో ఎన్నికల సమరానికి రంగం సిద్ధం అవుతోంది. సుదీర్ఘ కసరత్తు తరువాత దసరా లోగానే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక జీవోతోనే వెళ్లేందుకు సిద్ధమైంది.ఈ మేరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. రెండు రోజుల్లోగా వాటిని ఖరారు చేసి పంపాలని జిల్లాల కలెక్టర్లకు సర్కారు ఆదేశాలిచ్చింది. దీంతో, వచ్చే నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు జరుగుతోంది. బీసీల రిజర్వేషన్ల వ్యవహారంపై కేంద్రం ఎటూ తేల్చకపోవడంతో.. పెంచిన రిజర్వేషన్లను అమలుచేసేందుకు వీలుగా పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285(ఏ)లో చేసిన సవరణలతో జీవో జారీ చేసేందుకు సర్కారు సిద్ధమైనట్టు సమాచారం. విజయ దశమిలోగా షెడ్యూలు విడుదలకు వీలుగా.. వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్‌ల ఎన్నికకు అవసరమైన రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని, రెండు రోజుల్లోగా వాటిని ఖరారు చేసి పంపాలని జిల్లాల కలెక్టర్లకు సర్కారు ఆదేశాలిచ్చింది. కాగా రిజర్వేషన్‌ల ఖరారుకు అవసరమైన సమాచారం మొత్తాన్నీ ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అందించింది.ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను 2024లో నిర్వహించిన కులగణన వివరాల ప్రకారం ఖరారు చేయాలని కలెక్టర్లకు సూచించింది.

## సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్



ఇంటర్నెట్ డెస్క్ (సందేశం టైమ్స్) తెలంగాణ రాష్ట్రంలోని సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కలిశారు. నీట మునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం తెలిపింది. 6.7 టీఎంసీ సామర్థ్యంతో ములుగు జిల్లాలో ఈ సమ్మక్క సాగర్ డ్యాం నిర్మాణం జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు వల్ల నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. రామప్ప%–పాకల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు అందుతుంది. వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది.

మిగతా 2లో...

## గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 22(సందేశం టైమ్స్) : పేదల ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నాడే ఎందుకు కూల్చివేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు.

మిగతా 2లో...

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు.. నళినిని కలిసిన కలెక్టర్..



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ నళినిని (సోమవారం) కలిశారు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు. తెలంగాణ ప్రభుత్వం నళినికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉందనే విషయాన్ని వివరించారు కలెక్టర్. సర్వీసు ఇష్యూలు ఏం ఉన్నా నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన సందేశాన్ని నళినికి తెలిపారు కలెక్టర్ హనుమంతరావు.

నాకు రావాల్సింది ఇవ్వాలి: నళిని

నళినిని కలెక్టర్ కలవడానికి ముందు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 'నాకు సీఎం రేవంత్‌రెడ్డి ఆశ కల్పించారు. నా 16 పేజీల లేఖను చెత్తబుట్టలో వేశారు. తెలంగాణ డీజీపీని సీఎం రేవంత్‌రెడ్డి కలవమన్నారని చెబితే.. నేను వెళ్లి కలిశాను. నాకు రావాల్సింది ఇవ్వమన్నాను.. కానీ భిక్ష అడగలేదు. 2011లో ప్రజల గురించి ఆలోచించి జై తెలంగాణ అని ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఆ తర్వాత నన్ను సస్పెండ్ చేశారు. నాకు రావాల్సినది ఇవ్వడానికి ఇన్నేళ్లుగా నేను ఎదురుచూడాల్సి వచ్చింది' అని ఆవేదన వ్యక్తం చేశారు నళిని.

మిగతా 2లో...

## వారి జోలికొస్తే మాడి మసైపోతావ్.. రేవంత్ ప్రభుత్వానికి ఈటల మాస్ వార్నింగ్



మేడ్చల్ , సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్) : హైడ్రా అధికారులకు దమ్ముంటే ప్రభుత్వ స్థలంలో బిల్డర్లు, నాయకుల ఆక్రమణలు తొలగించాలని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. హైడ్రా అధికారులు పేదల ఇల్లు కూలగొట్టి వారి జీవితాలతో చెలగాటమాడవద్దని హితవు పలికారు. కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలని రాజ్యాంగం చెప్పిందని.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పేదల జోలికి రావడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న డబుల్ బెడ్ రూం ఏమోకానీ.. 40 ఏళ్లుగా ఇక్కడే బతుకుతున్న పేదల ఇళ్లు కూల్చారని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్.కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారంలోని ఐదు బస్తీల్లో ఉన్న పేదల ఇళ్లను కూలగొట్టింది హైడ్రా. కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులను ఇవాళ(సోమవారం) పరామర్శించారు ఈటల రాజేందర్. బస్తీలన్నీ కలియ తిరిగి బాధితులతో మాట్లాడి ధైర్య చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే బాధితులకు కరెంటు, నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. 300 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాతలు, తండ్రులు, ఇప్పుడు పిల్లలు ఉంటున్నారని చెప్పుకొచ్చారు. గుట్టలు, పుట్టలు ఉండి మనిషి ఉండే దిక్కులేనప్పుడు రూ. 5 వేలకు ఎకరం ఉన్న దగ్గరి నుంచి వీరు ఇక్కడ ఉంటున్నారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేయడానికి వడ్డెరలు వచ్చారని చెప్పుకొచ్చారు ఎంపీ ఈటల రాజేందర్.కంకర మిషన్ ఫ్యాక్టరీల్లో పనిచేసి కాళ్లు, చేతులు పోగొట్టుకొని మరీ పేదలు ఇక్కడ బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 గజాల గుడిసెల్లో ఉండే వారి మీదనా హైడ్రా ప్రతాపమని హెచ్చరించారు.

మిగతా 2లో...

## అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల సంగతి తేల్చండి: ప్రభుత్వానికి కవిత సవాల్

- గాజులరామారంలో పేదల ఇళ్ల కూల్చివేతపై తీవ్ర ఆగ్రహం
- మళ్లీ బుల్డోజర్ వస్తే అడ్డుగా నిలబడతానని హెచ్చరిక
- బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, 50 వేల సాయం డిమాండ్

(సందేశం టైమ్స్): శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఆయన కబ్జా చేశారంటున్న 12 ఎకరాల భూమి సంగతి ఏంటని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గాజులరామారంలో హెచ్ఎండీఏ చేపట్టిన కూల్చివేతల బాధితులను పరామర్శించిన ఆమె, ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



మిగతా 2లో...

## ఓటుకు నోటు కేసు.. సుప్రీంలో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22(సందేశం టైమ్స్) : ఓటుకు నోటు కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈకేసుకు సంబంధించి సుప్రీంలో వాదనలు జరుగగా తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. ఓటుకు నోటు వ్యవహారంలో జెరూసలెం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేయడంపై సుప్రీం ధర్మాసనంలో రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. దీనిపై ఈరోజు (సోమవారం) వాదనలు జరుగగా.. తీర్పును సుప్రీం రిజర్వ్ చేసింది.

మిగతా 2లో...

# సంపాదకీయం

## సంక్షేమమా సంక్షోభమా

'మింగ మెతుకు లేదు  మీసాలకు సంపెంగ నూనె' అన్నది ఒక సామెత! ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిస్థితికి ఈ సామెత అచ్చుగుద్దినట్టు సరిపోతుంది. అప్పు చేయనిదే పూట గడవని పరిస్థితి ఉన్నప్పటికీ రెండు రాష్ట్రాల ప్రభుత్వాల మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి. తెలుగు రాష్ట్రాలకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు ఎవరు కారణం? 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని, రాష్ట్రం రెవెన్యూ మిగులులో ఉందని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అదే సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రూ.20 వేల కోట్లకు పైగా రెవెన్యూ లోటుతో ఏర్పడింది. 11 ఏళ్ల గడిచేసరికి ధనిక రాష్ట్రమైన తెలంగాణ కూడా అప్పుల కుప్పగా మారింది. అప్పు కోసం వెళితే దొంగను చూసినట్టు చూస్తున్నారని ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు వాస్తవాన్ని బయటపెట్టారు. అంతే, తెలంగాణ పరువు తీస్తావా? అని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే... ఆ రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టుగా ఉంది. రాష్ట్రం అప్పులు పది లక్షల కోట్లు దాటాయి. అటు ధనిక రాష్ట్రం, ఇటు రెవెన్యూ లోటుతో ఏర్పడిన రాష్ట్రం కూడా కుదేలవడానికి కారణం ఏమిటి? రాజకీయ పార్టీలు బాధ్యతను విస్మరించి అధికారం కోసం పోటీపడుతూ... అపర దానకర్ణుల వలె ప్రజాధనాన్ని పప్పూ బెల్లాల్లా పంచిపెట్టడానికి పోటీపడటంతో రెండు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. సంక్షేమ పథకాలకు కూడా అప్పులు చేయవలసి వస్తోంది. ప్రభుత్వ ఆస్తులను కుదువ పెట్టడమే కాకుండా, భవిష్యత్ ఆదాయాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్లనే తెలుగు నాట ప్రస్తుత దుస్థితి దాపురించింది. ఏదో ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి రావడం కోసం లేదా ఎవరో ఒకరు ముఖ్యమంత్రి కావడం కోసం సంక్షేమం పేరిట అలవికాని పథకాలను ప్రకటిస్తూ తెలుగు రాష్ట్రాలను దివాలా తీయిస్తున్నారు. కొంతమేరకు భారతీయ జనతా పార్టీని మినహాయిస్తే, మిగతా ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఈ పాపంలో భాగం ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలలో చేపట్టిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు ఒక్కో రాష్ట్రంలో లక్ష కోట్లు దాటాయి. చివరికి పరిస్థితి ఎంతవరకూ వెళ్లిందంటే, నిర్దిష్టంగా నిధుల లభ్యత ఉన్న పనులకు మినహా మిగతా పనులు చేపట్టడానికి ప్రభుత్వాలు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కరువై అల్లాడుతున్నారు. ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని తెలిసి కూడా కొత్త పథకాల ప్రకటనలో రాజకీయ పార్టీలు తగ్గేదేలే అన్నట్టుగా పోటీ పడుతున్నాయి.

11 ఏళ్ల క్రితం నిజంగానే రెవెన్యూ మిగులుతో ధనిక రాష్ట్రంగా ఉండిన తెలంగాణలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ అనేక సరికొత్త సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారు. దీంతో అభివృద్ధి పనులకు అప్పులు చేయాల్సిన పరిస్థితిలోకి తెలంగాణ వెళ్లింది. ఎన్నికల్లో ప్రయోజనం పొందడమే పరమావధిగా సంక్షేమ పథకాలను జనంలోకి వదిలారు. హుజూరాబాద్‌కు జరిగిన ఉప ఎన్నికలో ఈటల రాజేందర్‌ను ఓడించేందుకు కేసీఆర్ 'దళితబంధు' పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన దళిత కుటుంబాలకు పది లక్షల రూపాయల వంతున పంచిపెట్టారు. అయినా ఆ ఉప ఎన్నికలో అధికార బీఆర్ఎస్ ఓడిపోయి ఈటల రాజేందర్ గెలిచారు. ఆ తర్వాత 'దళిత బంధు' పథకం కూడా అటకెక్కింది. దళితులకేనా 'బంధు'... మాకివ్వరా? అని మిగతా వర్గాల ప్రజలు అలకబూనారు. దీంతో కేసీఆర్ పరిస్థితి ఉభయ భ్రష్టత్వం అయింది. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములను కూడా ఎడా పెడా అమ్మేశారు. అయినా రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతూనే ఉంది. ఈ దశలో ఎన్నికలు రావడం, ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ కూడా గ్యారెంటీల పేరుతో సరికొత్త హామీలు ఇచ్చింది. కారణాలు ఏమైనా, 2023 ఎన్నికల్లో కేసీఆర్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నాక రేవంత్ రెడ్డికి తత్వం బోధపడటం మొదలైంది. రైతు రుణ మాఫీ కోసం దాదాపు పాతిక వేల కోట్ల రూపాయలు పంచిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనం పొందకపోగా... కేసీఆర్ ప్రారంభించిన పథకాలకు నిధులు సమకూర్చలేక గుడ్లు తేలేసింది. దీంతో ప్రభుత్వం అప్పుల వేటకు బయలుదేరింది.తోటి వాడు తొడ కోసుకుంటే తాను మెడ కోసుకున్నట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల జాతరకు తెర లేపారు. అప్పట్లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో ప్రారంభమైన అనేక పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసేందుకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆపసోపాలు పడ్డారు. మొత్తానికి ముక్కుతూ మూలుగుతూ ఐదేళ్ల కాలం పూర్తయింది. ఎన్నికలు వచ్చి పడటంతో వృద్ధాప్య పింఛన్లను చంద్రబాబు రెండు వేలకు పెంచారు. అంతటితో ఆగకుండా 'పసుపూ కుంకుమ' పేరిట డ్వాక్రా మహిళలకు పదివేల రూపాయల వంతున పంచిపెట్టారు. చంద్రబాబు అధికారం కోల్పోకుండా ఇలాంటి పథకాలు అడ్డుకోలేక పోయాయి. 2014లో తాము అధికారంలోకి వచ్చినట్టేనన్న అతి విశ్వాసంతో ఉండి బోర్లాపడిన జగన్మోహన్ రెడ్డి.. 2019 ఎన్నికల్లో మాత్రం చాన్స్ మిస్ కాకూడదని భావించి 'నవరత్నాలు' పేరిట సరికొత్త పథకాలను ప్రకటించారు. అనూహ్యంగా 151 సీట్లతో అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఆయన ఎన్నో పిల్లిమొగ్గలు వేశారు. ఐదేళ్లలో సంక్షేమ పథకాల పేరిట దాదాపు రెండున్నర లక్షల కోట్లు పంచారు. ఈ డబ్బు సమకూర్చుకునేందుకు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వ ఆదాయాన్ని తాకట్టు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను, కార్యాలయాలను కూడా కుదువ పెట్టి అప్పు చేశారు. తన చేతికి ఎముక లేదని, తాను పేదల పెన్నిధినని, అపర దానకర్ణుడినని చెప్పుకొచ్చారు. ఐదేళ్లు గడచిపోయాయి. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో "సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. 'అమ్మ ఒడి' స్థానంలో తీసుకు వచ్చిన 'తల్లికి వందనం' పథకం కింద ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ సాలీనా 15 వేల రూపాయల వంతున పంచుతామని ప్రకటించారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా, ఆర్థికంగా అంతో ఇంతో పటిష్ఠంగా ఉన్న తమిళనాడులో కూడా పెన్షన్లు నాలుగు వేలు లేవు. ఇదే కాకుండా మహిళలకు ఏటా 15 వేల వంతున ఇస్తామన్నారు. ఇది ఇంకా అమలు కాలేదు. అమలు అవుతుందన్న గ్యారెంటీ కూడా లేదు.

# వారి జోలికొస్తే మాడి మసైపోతావ్..
# రేవంత్ ప్రభుత్వానికి ఈటల మాస్ వార్నింగ్

దేశం ఇంకో దేశం మీద దాడి చేసినట్లుగా.. దొంగ దెబ్బ తీసినట్లు.. పదుల సంఖ్యలో జేసీబీలు పెట్టి ఆదివారం వచ్చి పేదల ఇళ్లను కూలగొట్టారని ఫైర్ అయ్యారు. ఇళ్లను కూలగొట్టడంతో నిన్న రాత్రి అంతా ఆ పిల్లలతో వర్షంలోనే తడుస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు స్తంభాలు కూలగొట్టి, కరెంటు లేకుండా, తాగడానికి నీళ్లు లేకుండా చేశారని మండిపడ్డారు. ఇక్కడి పేదల దీనాస్థితి చూసైనా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించాలని హితవు పలికారు. బ్రోకర్లను ఉరి తీయండి, అరెస్ట్ చేయండి.. కానీ 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఉంటున్న పేదల ఇళ్లను కూలగొట్టి ఆడబిడ్డలకు బతుకమ్మ సంబరాలు లేకుండా చేసి వారి కన్నీటిని చూశారని ధ్వజమెత్తారు ఎంపీ ఈటల రాజేందర్.రూ. 15 వేల కోట్ల స్థలాలు కాపాడామని హైడ్రా అధికారులు అంటున్నారని.. కానీ ఇక్కడ ఉంది 300 గుడిసెలు, పేదల ఇళ్లని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్లని కూలగొట్టి రూ.15 వేల కోట్ల స్థలాలు కాపాడామని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడానికి సిగ్గు ఉందా అని ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా బస్తీ వాళ్లతో ప్రభుత్వం మాట్లాడాలని సూచించారు. నరసింహ బస్తీ, బాలయ్య బస్తీ, గాలిపోచమ్మ బస్తీలో ఉన్నవారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లల పుస్తకాలు, ఇంట్లో సామాన్లను సైతం తొక్కించడంతో కన్నీరు మున్నీరవుతున్నాహైడ్రా అధికారులు కనీసం కనికరించడం లేదని మండిపడ్డారు. నిజాంలు, రాజులు కూడా ఇంత మూర?ంగా హైడ్రా అధికారుల మాదిరిగా ప్రవర్తించలేదని ఫైర్ అయ్యారు ఎంపీ ఈటల రాజేందర్.శంకర్ హిల్స్ లాంటి ప్రాంతాల్లో వంద కోట్ల ఎకరాల ఉన్న భూములను కబ్జా చేస్తే హైడ్రా అధికారులు ఎందుకు పట్టించుకోరని ప్రశ్నల వర్షం కురిపించారు. నోరు లేని వారిని, దిక్కు లేని వారిని, పేదరికంలో మగ్గుతున్న వారికి కన్నీళ్లు పెట్టిస్తే హైడ్రా అధికారులకు మంచి జరుగదని హితవు పలికారు. గాజులరామారంలోని పేదలు పరాయి వారు కాదని... పాకిస్థాన్, బంగ్లాదేశ్ వాళ్లా..?.. భారతమాత బిడ్డలు కాదా..? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా పేదల ఇళ్లను కూలగొట్టడం ఆపాలని సూచించారు ఎంపీ ఈటల రాజేందర్.గాజుల రామారంలో బ్రోకర్లు ఉంటే అరెస్ట్ చేయండి.. డబ్బులు రికవరీ చేయండి... కానీ పెదల జీవితాలతో ఆడుకోవద్దని కోరారు. పేదల మీద కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతాపం చూపొద్దని హితవు పలికారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల జోలికెళ్లడమేనా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్నా రూ.2500, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు కానీ పేదల గూడును మాత్రం చెదరగొడుతున్నారని మండిపడ్డారు. పేదల జోలికి వస్తే మాడి మసి అవుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి మీదనో కోపంతోని పేదల ఇళ్లను కూల్చవద్దని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే కూలగొట్టిన వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు..
# నళినిని కలిసిన కలెక్టర్..

మరణ వాగ్మూలం అంటూ నళిని ప్రకటన..

అయితే, నళిని గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఆమె సోషల్ మీడియాలో నిన్న(ఆదివారం) తన మరణ వాగ్మూలం అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డిని తాను గతంలో కలిసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో తాను పోరాడిన విధానం గురించి ఆమె తెలిపారు. తనకు రావాల్సింది ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు నళిని.

## గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలపై

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో హైకోర్టు సెలవు దినాల్లో కూల్చివేతలు చేయవద్దని స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. అయినప్పటికీ గాజులరామారంలో కోర్టు సెలవు రోజు చూసుకొని మరీ పేదల ఇళ్లను కూల్చివేశారని ఫైర్ అయ్యారు. గాజులరామారంలో ఇళ్లు కూల్చివేశారని... రేపు జూబ్లీహిల్స్‌లోని బోరబండ బస్తీకీ రేవంత్ రెడ్డి హైడ్రాతో వస్తారన్నారు.కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే, మన ఇళ్లు కూలగొట్టమని కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యానికి లైసెన్స్ ఇచ్చినట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సర్దార్ ఇంటిని కూల్చివేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ కూలగొట్టిన ఆ ఇంటిని మళ్లీ కట్టించి ఇచ్చే బాధ్యత తనది అంటూ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సినిమా అయిపోయిందని.. రెండు సంవత్సరాల్లో చేసిందేమీ లేదని విమర్శించారు. హైడ్రా బుల్డోజర్ పేదల ఇళ్లపైకే వెళ్తుందని.. పెద్దల ఇళ్లకు వెళ్లదంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సోదరుడితోపాటు మంత్రులు పొంగులేటి, వివేక్ వంటి వారు ప్రభుత్వ స్థలాల్లో, చెరువులపై ఇళ్లు కట్టినా వాటిని

# సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్

**సమ్మక్కసాగర్ ప్రాజెక్ట్‌కు ఛత్తీస్‌గఢ్ గ్రీన్ సిగ్నల్**

ఎన్‌ఓసీ ఇచ్చేందుకు అంగీకారం

రాయ్‌పూర్‌లో సీఎం విష్ణు దేవ్ సాయిని కలిసిన మంత్రి ఉత్తమ్

నీటమునిగే భూభాగం పరిహారం భరించేందుకు తెలంగాణ అంగీకారం

6.7 టీఎంసీ సామర్థ్యంతో ములుగు జిల్లాలో నిర్మాణం

నల్గొండ, వరంగల్‌లో తాగునీటి సమస్యలకు సమ్మక్కసాగర్ పరిష్కారం

రామప్ప%–%పాకల లింక్ కెనాల్ కింద కొత్తగా 12,146 ఎకరాలకు నీరు

వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జంగావ్, ఖమ్మం జిల్లాలకు లబ్ధి

90 కిలోమీటర్ల టన్నెల్ నెట్‌వర్క్‌తో భారీ ఇంజనీరింగ్ డిజైన్

మూడు పంప్‌హౌసులు, క్రాస్ డ్రెయినేజ్ వర్క్స్ ప్రాజెక్ట్‌లో భాగం

ఛత్తీస్‌గఢ్‌లో 73 హెక్టార్ల భూభాగం నీటిమునిగే అవకాశం

పరిహారం, పునరావాసం భరించేందుకు తెలంగాణ సిద్ధం అని తెలిపిన మంత్రి ఉత్తమ్

ఐఐటీ ఖరగ్‌పూర్ సబ్‌మెర్జెన్స్ స్టడీ ఫైండింగ్స్ అమలు చేస్తామన్న ఉత్తమ్

ఎన్‌ఓసీ జారీకి ముందే అడ్వాన్స్ చెల్లింపులు ఇవ్వడానికి తెలంగాణ సిద్ధం

## ఓటుకు నోటు కేసు.. సుప్రీంలో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

ఛార్జిషీట్‌లో, ఎఫ్ఐఆర్‌లో ఏ4గా ఉన్న నిందితుడిపై ఎలాంటి చర్యలు వద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది మేనకా గురుస్వామి కోర్టుకు తెలిపారు. హైకోర్టే ట్రయల్ నిర్వహించి తీర్పు ఇచ్చేసిందని ప్రభుత్వం పేర్కొంది. కేసు ప్రాథమిక దశలోనే... నిందితుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ని కొట్టివేసిందని ప్రభుత్వం తరపు న్యాయవాది వాదించారు. మొత్తం కేసులో కీలక నిందితుడిగా ఉన్న వ్యక్తిపై ఎఫ్ఐఆర్ కొట్టివేయడం దర్యాప్తుపై ప్రభావం చూపుతోంది కాబట్టి... దర్యాప్తు కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని కోర్టును సర్కార్ కోరింది. అయితే ఈ కేసులో హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఆదేశాలు ఇచ్చిందని మత్తయ్య తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.

ఇరువురి వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో సీఎం ఉన్నా... నిందితుడిపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇక్కడికి రావడాన్ని అభినందిచాలని సీజేఐ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది మేనకా గురుస్వామి 'అది రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత' అని పేర్కొన్నారు.

# అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల సంగతి తేల్చండి:

గాజులరామారంలో పర్యటించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. కూలిపని చేసుకుని బతికే పేదల ఇళ్లను కూల్చడంలో హీరోయిజం ఏముందని హెచ్ఎండీఏ అధికారులను నిలదీశారు. "పెద్దవాళ్లు చేసిన ఎకరాల కొద్దీ కబ్జాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా? ముందు అరికెపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల సంగతి తేల్చండి" అని ఆమె డిమాండ్ చేశారు. పండుగ సమయంలో పేదల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆదివారం రోజున ఇళ్లు కూల్చడం అమానుషమని మండిపడ్డారు. కూల్చివేతలకు గురైన బాధితులకు ప్రభుత్వం తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని, తక్షణ సాయంగా రూ. 50 వేలు అందించాలని కవిత డిమాండ్ చేశారు. వచ్చే నెల 6వ తేదీలోగా బాధితులకు న్యాయం జరగకపోతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. "మళ్లీ ఇక్కడికి బుల్డోజర్ వస్తే, దానికి అడ్డుగా నిలబడే మొదటి వ్యక్తిని నేనే అవుతా" అని ఆమె హెచ్చరించారు. వెంచర్లు వేసి అమ్మిన వారి నుంచి బాధితులకు డబ్బులు తిరిగి ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

## లక్ష రూపాయలతో మంచినీటి బోరు వేయించిన బాంచ నాగభూషణం



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి  సెప్టెంబర్ 22: గ్రామ ప్రజల నీటి దాహార్తి కోసం కౌడిపల్లి మండలం రాజిపేట గ్రామ బిజెపి అధ్యక్షుడు సోమవారం బాంచ నాగభూషణం లక్ష రూపాయలతో మంచినీటి బోరుబావిని వేయించారు. అనంతరం సోలార్ రౌండ్ బల్బులు బిగించారు. వివిధ ఖర్చులకోసం సొంత డబ్బులతో సుమారు రూ.లక్ష 30 వేల వరకు ఖర్చు చేసి గ్రామాభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తున్నారు. తనవంతు సహాయంగా గ్రామానికి అండగా ఉంటానని పేదలకి కష్టం వస్తే ఊరుకోండి నాగభూషణం తెలిపారు.అనంతరం గ్రామస్తులు బాంచ నాగభూషణంను అభినందించారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందజేస్తూ అండగా నిలుస్తున్నాడని గ్రామస్తులు అభినందించారు. అనంతరం మంచినీటి బోర్ వద్ద గ్రామస్తులంతా కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీరుడి సాయి, కాశమ్మ వెంకటేశం గౌడ్, నాగరాజు, మన్నె ప్రవీణ్ గ్రామస్తులు ఉన్నారు.

# కింగ్ జిన్ టాలెంట్ స్కూల్ లో బతుకమ్మ సంబరాలు




సందేశం టైమ్స్ :పుల్కల్ మండలం ప్రతినిధి 22సెప్టెంబర్ సంగారెడ్డి జిల్లాపుల్కల్ మండల్ కేంద్రం లో కింగ్ జిన్ టాలెంట్ స్కూల్ లో బతుకమ్మ సంబరాలు నిర్వహించరు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు జేమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.బతుకమ్మ ఆట పాటలతో విద్యార్థులు సంతోషం బతుకమ్మ పండగ జరుపుకున్నారు. బతుకమ్మ ఆడిన అనంతరం స్కూల్ ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించండి: కలెక్టర్ ఆదేశం

సూర్యాపేట, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను జిల్లా అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావుతో కలిసి ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్, ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులు పెండింగులో ఉండకుండా అధికారులు వెంటనే స్పందించాలి. సంబంధిత శాఖలు జాగ్రత్తగా పరిశీలించి ఆలస్యం చేయకుండా సమస్యలు పరిష్కరించాలి” అని సూచించారు.నేడు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 61 ఫిర్యాదులు అందాయి. వీటిలో భూముల సమస్యలకు 23, డిపిఓకి 7, మున్సిపల్ కమిషనర్లకు 5, ఎంప్లాయిమెంట్ అధికారికి 5, ఎంపీడీవోలకు 4, ఇతర శాఖల అధికారులకు 17 ఫిర్యాదులు చేరాయి. ఈ ఫిర్యాదులన్నీ సంబంధిత శాఖలకు పంపించామని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, డీసీఓ



పద్మ, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస్, నరసింహారావు, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

సూర్యాపేట, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, రోడ్లు %ు% భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి, వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని, రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. అటవీ భూముల




కారణంగా ఎదురయ్యే సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలని ఆయన కలెక్టర్లకు ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఆర్టీఓ అధికారి సతీష్ కుమార్, సూపరింటెండెంట్ శ్రీలత పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థుల కోసం రెండు ముఖ్య పథకాలు : జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి

సూర్యాపేట, సెప్టెంబర్ 22:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థుల కోసం రెండు ప్రధాన పథకాలను అందుబాటులోకి తెచ్చింది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

1. శ్రమికుల ఆర్థిక సహాయం ఎంప్లాయ్‌మెంట్ బిజినెస్:
ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, కార్మికులు తమ వృత్తి అభివృద్ధికి గాను రూ.1,00,000/- వరకు 100% సబ్సిడీతో ఆర్థిక సహాయం పొందవచ్చు. దరఖాస్తులు 21 నుండి 55 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు సమర్పించవచ్చు.

2. ఇన్‌డస్ట్రియల్ మైనారిటీ ముస్లిం యూత్:
ఉద్యమకారులుగా మారదలచిన మైనారిటీ విద్యార్థులకు రూ.50,000/- నుండి రూ.2.00 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ పథకం ద్వారా కూడా 21 నుండి 55 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.దరఖాస్తులు వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 6, 2025లోపు సమర్పించాలి.జిల్లాలోని అన్ని మండలాల మైనారిటీ సంక్షేమ కార్యాలయాల్లో మరింత సమాచారం అందుబాటులో ఉంటుందని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తెలిపారు.



తెలంగాణ ప్రభుత్వం
జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి గారి కార్యాలయము, సూర్యాపేట.

తేది:22.09.2025.

పత్రికా ప్రకటన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం, ఆర్థిక సహాయం చేయుటకై రెండు ప్రధాన పథకాలను ప్రారంభించినది దీనికై అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ఆన్లైన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in ద్వార దరఖాస్తులను కోరనైనది.

1. "రేవంత్ అన్నకా సహారా - మిస్కీనో కే లియే":
ఈ పథకం క్రింద ఫకీర్, దుదేకుల మరియు ఇతర అట్టడుగు ముస్లిం వర్గాల అభ్యున్నతి మరియు సంక్షేమం కోసం, మైనారిటీ ఫైనాన్సు కార్పొరేషన్, యూనిట్ ఖర్చు: రూ.1,00,000/- వరకు 100% సబ్సిడీతో మోపెడ్లు / బైక్‌లు / ఈ-బైక్‌లు పంపిణీ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దరఖాస్తుదారులు ఫకీర్ లేదా దుదేకుల లేదా అట్టడుగు ముస్లిం వర్గానికి చెంది ఉండాలి, రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు కలిగి, వారి వయస్సు 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. గత 5 సంవత్సరాల్లో TGMFC నుండి ఆర్థిక సహాయం పొందకుండ ఉండాలి. మరియు ఒక కుటుంబానికి ఒకే లబ్ధిదారుడు / లబ్ధిదారురాలు మాత్రమే అర్హులు.

2. "ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన":
ఈ పథకం క్రింద మైనారిటీ మహిళలు అనగా ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, మరియు పార్శీలకు చెందిన వితంతువులు , విడాకులు పొందిన మహిళలు, అనాధలు, ఒంటరి మహిళలలు తమ ఆర్థిక ఉన్నతికై చిన్నపాటి వ్యాపారం ఏర్పాటు చేయుట కోసం, మైనారిటీ ఫైనాన్సు కార్పొరేషన్ ద్వార రూ.50,000/- ఒకసారిగా ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తులు కోరనైనది. దరఖాస్తుదారులు రేషన్ కార్డు కలిగి ఉండి, వయస్సు 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి, కనీస విద్యార్హత – 5వ తరగతి ఉత్తీర్ణత, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాల్లో రూ.2.00 లక్షలకు మించరాదు మరియు గత 5 సంవత్సరాల్లో ఇతర ఆర్థిక సహాయం పొందకుండ ఉండాలి.

ఇట్టి పథకములను ఆన్లైన్ ద్వార దరఖాస్తు చేసుకునే చివరి తేది: 06-10-2025, కావున అర్హత కలిగిన మైనారిటీలు ఈ పథకములను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి, ఎల్ శ్రీనివాస్ గారు తెలిపినారు.

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి,
సూర్యాపేట
District Minorities Welfare Office
SURYAPET Dist.

దీని ప్రతిని శ్రీయుత సమాచార మరియు పౌర సంబంధాల అధికారి గారికి అన్ని దినపత్రికలలో ప్రచురణ నిమిత్తం సమర్పించనైనది

# మంత్రి దామోదర్ చొరవతో నూతన అంగన్వాడీ భవనానికి భూమి చేసిన అధికారులు.




సందేశం టైమ్స్ న్యూస్ నారాయణాఖేడ్ ప్రతినిధి సెప్టెంబర్ 22: రాష్ట్ర మంత్రి వర్యులు వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో అంగన్వాడీ భవనానికి భూమి పూజ చేయడం జరిగింది అలాగే ముస్లాపూర్ నుండి బైరన్ దిబ్బ రోడ్ భారీ వర్షాల కారణంగా ధ్వంసం కావడం వల్లన ఈరోజు మరియు అలాగే గ్రామ సెక్రెటరీ , కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మరియు ఉ పాధ్యక్షులు నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకులు అందరు కలిసి పరిశీలించడం జరిగింది . అలాగే ప్రజల అవసరాల కోసం తొందరగా రోడ్ బాగు చేయాలని కూడా కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరడం జరిగింది .

# కురుసునూరులో విషాదం: బ్రిడ్జి ప్రమాదంలో వ్యక్తి మృతి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 22సెప్టెంబర్ సంగారెడ్డి జిల్లాలోని రాయికోడ్ మండల పరిధిలో ఘోరమైన సంఘటన జరిగింది. కుసునూరు గ్రామానికి చెందిన ముదిరాజ్ కృష్ణ (44) అనే వ్యక్తి బైక్‌తో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వాగులో పడిపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు.సెప్టెంబర్ 21, 2025న, సాయంత్రం 4:30 గంటలకు కృష్ణ కూరగాయలు కొనడానికి కుసునూరులోని తన ఇంటి నుంచి బయలుదేరి, ప్రతి ఆదివారం జరిగే రాయికోడ్ చౌరస్తా సంతకు వెళ్లాడు. సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో తిరిగి తన గ్రామమైన కుసునూరుకు వెళ్తుండగా, మార్గమధ్యంలోని కుసునూరు బ్రిడ్జి వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.బ్రిడ్జిపై గల గుంతలను తప్పించబోయిన కృష్ణ, తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై అదుపుతప్పి వాగులోకి పడిపోయాడు. వర్షకాలం కారణంగా నీటి ప్రవాహం తీవ్రముగా ఉండటంతో, అతను ప్రవాహంలో కొట్టుకుపోయాడు.సంఘటన జరిగిన వెంటనే, పోలీసు, గ్రామస్తులు మరియు ఎన్డీఆర్ఎఫ్ బృందం కలసి గాలింపు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 22 ఉదయం సుమారు 11 గంటల సమయంలో వందూరు మాడ వాగు వద్ద కృష్ణ శవమై తేలాడు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి,



పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం, కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.
ఈ ఘటనపై, మృతుడి భార్య జానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెం. 88/2025 కింద మరియు %దీచీూా% సెక్షన్ 194 ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు

# జోగిపేటలో నూతన నారాయణి షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా




సందేశం టైమ్స్ : నారాయణఖేడ్ ప్రతినిధితేదీ: సెప్టెంబర్ 22, 2025సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట పట్టణం వ్యాపార రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. పట్టణంలో అత్యాధునికంగా నిర్మించిన నారాయణి షాపింగ్ మాల్ ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, “జోగిపేటను వ్యాపార హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇలాంటి మాల్‌ల ఏర్పాటు వాణిజ్యవృద్ధికి దోహదం చేస్తాయి. యువతకు ఉపాధి అవకాశాలు, వినియోగదారులకు అధునాతన సదుపాయాలు లభిస్తాయి” అని తెలిపారు.నూతనంగా ఏర్పాటు చేసిన మాల్ నిర్వాహకులను ఆయన అభినందించారు.ప్రారంభ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.అందులో ఫోక్ సింగర్ నాగదుర్గ, సురేందర్ గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షులు పట్లోల సంగమేశ్వర్, మార్కెఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి, ఎఎంసీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 1.10 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు




చీరాల, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూనే ఉన్నారు. ఎంతలా అవగాహన కల్పించినా వారి వలలో ప్రజలు పడుతూనే ఉన్నారు. తాజాగా ఏలూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ నుంచి సైబర్ నేరగాళ్లు భారీ మొత్తంలో డబ్బు కొట్టేశారు. ఆయన భార్య ఖాతా నుంచి ఏకంగా రూ. కోటి, ఆయన ఖాతా నుంచి రూ. 10 లక్షల నగదును తమ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నారు. బాధితుడు రాత్రి చీరాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ నేరగాళ్ల దోపిడీ వెలుగులోకి వచ్చింది. చీరాల వన్‌టౌన్ సీఐ సుబ్బారావు కథనం ప్రకారం, బాపట్ల జిల్లా చీరాలకు చెందిన విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు ఏలూరు మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 9న ఆయనకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. కాల్ లిఫ్ట్ చేయడంతోనే తాము ముంబై పోలీసులమని అవతలి వ్యక్తులు చెప్పారు. తర్వాత వీడియో కాల్ చేసి మనీ లాండరింగ్ కేసు పెడతామంటూ ప్రొఫెసర్‌ను బెదిరించారు. కేసు పెట్టకుండా ఉండాలంటే తమ ఖాతాకు లావాదేవీలు జరగాలంటూ నమ్మబలికారు. దర్యాప్తు అధికారి ప్రణయ్ సార్ ఖాతాకు రూ. 1.10 కోట్లు జమ చేయాలని చెప్పారు.

# డ్రగ్స్, సైబర్ నేరాలపై అనంతగిరి పోలీస్ కళాజాత

**జిల్లాలో డ్రగ్స్, సైబర్ నేరాలు, అన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, మత్తుమందులు, మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోలీసులు కళాజాత కార్యక్రమం నిర్వహించారు.ఎస్పీ కె. నరసింహ గారి ఆదేశాల మేరకు అనంతగిరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రంగయ్యగూడెం గ్రామంలో పోలీస్ కళాబృందం ద్వారా ప్రజలకు వివిధ అంశాలపై స్పష్టీకరణ ఇచ్చారు.**







అనంతగిరి, సెప్టెంబర్ 22(సందేశం టైమ్స్) : SI నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ ఉన్నారని, గ్రామంలో శాంతిభద్రతలు కాపాడితేనే అభివృద్ధి సాధ్యమని, గొడవలు, అసాంఘిక చర్యలు గ్రామ అభివృద్ధికి ఆటంకం అవుతాయని చెప్పారు.అతను యువతను హెచ్చరిస్తూ ఒకసారి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని,రౌడీ షీటర్‌గా నమోదైతే జీవితాంతం చెడు ముద్ర తొలగదని వివరించారు.మహిళల రక్షణ విషయంలో మహిళలను గౌరవించాలని, వేధింపులు జరిగితే షీ టీం నంబరు 8712686056కు ఫిర్యాదు చేయాలని సూచించారు.సైబర్ నేరాలపై %ఉచిత బహుమతులు, తక్కువ రేట్ల ఆఫర్లు, లాటరీలు, ఫోన్, సోషల్ మీడియా ద్వారా వచ్చే మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దని,సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అలాగే %బెట్టింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని,పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని,ప్రభుత్వ పథకాల దుర్వినియోగం చేయొద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పోలీసు అధికారి ఏడుకొండలు, బ్లూకోర్టు సిబ్బంది సుధాకర్, శ్రీనివాస్, కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, నాగార్జునతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలి

ఆలమూరు (కోనసీమ) సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): మండలంలోని జన్నాడ కళ్యాణ మండపం నందు ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలనే నినాదంతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారుగా వందమంది మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు, పెన్షన్ సంఘ నాయకులు, ప్రజలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలుపవలసిన ఆవశ్యకత, మండల ప్రజల అవసరాలపై మాట్లాడారు. తదుపరి కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని వారంతా వివరించారు. కేవలం ఆలమూరు మండలం మాత్రమే తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని నియోజకవర్గ ప్రస్తావన ఏమీ కార్యాచరణలో లేదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆలమూరు మండలం ఉండడం వలన జిల్లా కేంద్రమైనటువంటి అమలాపురం కలెక్టరేట్ కు ప్రజలు వెళ్లడానికి సుమారు 56 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవలసి వస్తుందన్నారు. దీంతో ఎన్నో రకాల ఇబ్బందులు మనమంతా ఎదుర్కొంటున్నామని, కాబట్టి ఈ మండలాన్ని తప్పనిసరిగా రాజమండ్రిలో విలీనం చేయాలని సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. తదుపరి సమావేశంలో మండల అఖిలపక్ష కమిటీ ఎన్నిక జరుగుతుందని అప్పుడు పూర్తి కార్యచరణ ప్రకటిస్తామని వారు వివరించారు.

## వంశధార నదిలో పడి హెచ్ఎం మృతి




నరసన్నపేట సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): గోపాలపెంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు నాగేశ్వరరావు(54) వంశధార నదిలో పడి మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... గోపాలపెంట గ్రామానికి చెందిన నాగేశ్వరరావు ఏడాదిగా స్వగ్రామంలోనే హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. స్వంత పనులపై నాగే శ్వరరావు పాఠశాలకు సెలవు పెట్టారు. ఇంటి నుంచి స్నానం కోసం శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో వంశధార నదికి వెళ్లి.. సాయంత్రం అయినా రాకపోవడంతో భార్య రమణమ్మ ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చారు. గ్రామస్థులు నదితీరంలో గాలించగా ఒడ్డున నాగేశ్వరరావు బట్టలు ఉండడాన్ని గుర్తించారు. స్నానానికి దిగి నీటి ఉధృతికి గల్లంతై ఉండొచ్చని నిర్ధారించారు. ఈమేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాగేశ్వరరావు మృతదేహం కోసం మధ్యాహ్నం వరకు ముమ్మరంగా గాలింపు చేపట్టగా గోపాలపెంట వద్ద లోతైన ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు. నాగేశ్వరరావుకి భార్యతోపాటు కుమారులు సునీల్, సుధీర్ ఉన్నారు. కాగా నాగేశ్వరరావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నెల్లూరు సెంట్రల్ జైలులో ఇద్దరి సస్పెన్షన్




నెల్లూరు(క్రైం) సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):నెల్లూరు కేంద్ర కారాగారంలో అధికారులు, సిబ్బంది పనితీరుపై రోజురోజుకూ విమర్శలు తీవ్రమవుతున్నాయి. ఇటీవల ఓ ఉన్నతాధికారి ఫోన్ సంభాషణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అలాగే, సెంట్రల్ జైలును రౌడీషీటర్లు తమ అడ్డాగా మార్చుకున్నట్లుగా రౌడీషీటర్ శ్రీకాంత్ విషయంలో స్పష్టమైంది. ఈ క్రమంలోనే తాజాగా.. శిక్ష పడిన ఓ ఖైదీని బ్లాక్ మార్చేందుకు ఇద్దరు అధికారులు ఫోన్‌పే ద్వారా తమ ఖాతలకు నగదు వేయించుకున్నారని ఆ ఖైదీ జైలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ లో ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ జరిగిన విషయం నిజమేనని తేలడంతో చీఫ్ హెడ్‌వార్డెర్ ఐ.హనుమంతరెడ్డి, డిప్యూటీ జైలర్ ఎం.విజయకుమార్‌ను జైళ్లశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు స్కోచ్ అవార్డు



విజయవాడ (భారతీనగర్) సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, దానికి ప్రతిఫలంగా అత్యంత ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు లభించిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. విజయవాడలో ల ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో జరగని విధంగా ఒక రోజంతా ముఖ్యమంత్రి ప్రజల్లో ఉండే కార్యక్రమం మన రాష్ట్రంలోనే జరిగిందని, అందుకే ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. అలాగే, దేశంలోనే మొదటిసారిగా ఫస్ట్ సర్క్యులర్ ఎకానమీ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఫస్ట్ రీసైక్లింగ్ పార్కు కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్రస్థాయిలో అక్టోబరు 2న 16 కేటగిరీల్లో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులు ఇస్తామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా 6 వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టులు రాబోతున్నాయని,

## బాబోరు కుక్కలు ఇబ్బందులు పడుతున్నారు.



జగ్గంపేట సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):జగ్గంపేటలో వీధి కుక్కల బెడదతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తరచూ రహదారి వెంబడి సంచరిస్తూ రోడ్లపై అటు ఇటు పరుగులు తీస్తున్నాయి. ఎక్కడ చూసిన కుక్కలు సంచరిస్తూ కనిపిస్తున్నాయి. హైవే ప్రక్కన సర్వీస్ రోడ్డులోను, గోకవరం రోడ్డులోను మాంసం దుకాణాలు వద్ద ఎక్కువగా సంచరిస్తున్నాయి. అలా సంచరిస్తూ రోడ్డుకు అటు, ఇటు పరుగులు పెడుతున్నాయి. పరుగులు పెట్టే క్రమంలో ద్విచక్ర వాహనాల్లో పడుతున్నాయి. వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో జగ్గంపేట నుంచి గోకవరం వెళ్ళే రోడ్డులో పలువురు ప్రమాదాల భారిన పడ్డారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. నెహ్రూ కాలనీ ఎంట్రన్స్ వద్ద, కాలనీలోను ఎక్కువగా గ్రామ సింహాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను నిరోధించాలని ప్రజలు, ద్విచక్ర వాహన దారులు కోరుతున్నారు.

## రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు



నరసాపురం సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామం బైనపాలెం సెంటర్‌లో సీసీ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మూడు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఇటీవల లక్ష్మణేశ్వరం నుండి తూర్పుతాళ్లు వరకూ నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు మధ్యలో స్తంభాలు మరిచారు. ఈ రోడ్డు మార్గంలో వెళ్తే రోడ్డు మధ్యలో పలు కరెంట్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. నిత్యం తీర ప్రాంత వాసులు, స్కూల్స్, కాలేజీ బస్సులు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటాయి. పొరపాటున భారీ వాహనాలు అదుపు తప్పితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డులో కరెంట్ స్తంబాలను తొలగించకుండానే కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తి చేశారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉండటంతో రోడ్డు మధ్యలో దాదాపు చాలా కరెంట్ పోల్స్ ఉండటం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంలో అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ పోల్స్‌ను తొలగించాలని కోరుతున్నారు.

# వసప కేజీబీవీలో 10.5 క్వింటాళ్ల బియ్యం సీజ్

**బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది**
**అక్రమ రవాణాకు రహస్య గదిలో నిల్వ**
**దసరా సెలవుల్లో దారి మళ్లింపునకు ప్రణాళిక**
**అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో వెలుగులోకి..**
**తహసీల్దార్ పరిశీలన.. బియ్యం స్వాధీనం**



కొత్తూరు, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం పక్కదారి పట్టిన ఘటన వసప కేజీబీవీలో చోటు చేసుకుంది. అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో వసప కేజీబీవీ ప్రిన్సిపాల్ అక్రమాలు వెలుగులో వచ్చా యి. పక్కా సమాచారం అందుకున్న తహసీల్దార్ కొప్పల బాలకృష్ణ శనివారం మధ్యాహ్నం వసప కేజీబీవీని సందర్శించి తనిఖీలు చేపట్టారు. రికా ర్డులు ప్రకారం స్టాక్ 248 కిలోలు ఉండాల్సి ఉం డగా.. వీటికంటే అదనంగా 1150 కిలోల (సుమా రు 10.5 క్వింటాలు) బియ్యం ఉన్నట్టు గుర్తించారు. 25 కిలోల చొప్పున్న ఉన్న సుమారు 46 ప్యాకెట్లు పాఠశాలలోని ఓ రహస్య గదిలో సామగ్రితో కలిపి దాచిపెట్టిన బియ్యాన్ని తహసీల్దార్ గుర్తిం చారు. దీనిపై ప్రిన్సిపాల్ రాధికను తహసీ ల్దార్ ప్రశ్నించారు. ఎన్నిరోజుల నుంచి వి ద్యార్థులకు భోజనాలు పెట్టకుండా బియ్యం మిగిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22వ తేదీ నుంచి దసరా సెలవు లు కావడంతో శనివారం విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత వీటిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకు న్నట్టు తెలుస్తుంది. తమ పిల్లలను పాఠ శాలలో చేర్పిస్తే అరకొర ఆహారం అందిం చి పస్తులు పెడుతుం డడంపై తల్లిదండ్రు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ప్రిన్సిపాల్ రాధికపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ బాలకృష్ణ మాట్లాడు తూ.. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక వీఆర్వోకు అప్పగించి, చర్యలకై సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీకి నివేదిస్తామని తెలిపారు.

# భిక్షాటనతో భక్తి మార్గం

**వచ్చిన సొమ్ముతో ఆలయాలకు సేవ చేస్తున్న సాధువు**
**ఏ గుడి వద్ద బిచ్చమెత్తితే అక్కడ వసతుల కల్పనకు కృషి**
**ప్రకాశం జిల్లా త్రిపురాంతకం ఆలయంలో క్యూలైన్ ఏర్పాటు**



త్రిపురాంతకం, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):భిక్షాటన అనేది చాలా మందికి జీవనోపాధి. మరికొందరికి అవసరాలు తీర్చే మార్గం. కానీ శివరాములు అనే సాధువు మాత్రం దాన్ని ఒక ఆధ్యాత్మిక సాధనంగా, సేవా మార్గంగా ఎంచుకున్నారు. తాను ఎక్కడైతే భిక్షాటన చేస్తారో.. వచ్చిన సొమ్మును ఆ ఆలయానికి అవసరమైన వసతుల కల్పన కోసం ఖర్చు చేస్తారు. 'మనం భూమిపైకి వచ్చేటప్పుడు ఏమీ తీసుకురాలేదు. వెళ్లేటప్పుడు కూడా అలానే వెళ్లాలన్నదే నా కోరిక' అని చెబుతుంటారు. ఆయనే ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్న శివరాములు (రెడ్డియార్). తమిళనాడు నుంచి రెండేళ్ల క్రితం త్రిపురాంతకం వచ్చిన ఆయన స్థానిక బాలాత్రిపురసుందరీదేవి ఆలయం వద్ద భిక్షాటన చేస్తున్నారు. ఈ రెండేళ్లలో వచ్చిన సొమ్ములో తన అవసరాలు పోనూ రూ.1.20 లక్షలు పోగేసి ఆలయం వద్ద ఇనుప రాడ్లతో ఒక క్యూలైన్‌ను ఏర్పాటు చేయించారు. 'ఆలయం వద్ద భిక్షాటనతో వచ్చిన డబ్బుతో క్యూలైన్ నిర్మాణం చేయించిన దాత రెడ్డియార్' అని ఆలయ నిర్వాహకులు ఒక బోర్డును ఏర్పాటు చేశారు. రెడ్డియార్‌ను " పలుకరించగా.. 'నాకు ఎలాంటి ప్రచారం అక్కర్లేదు. నేను ఏ గుడి వద్ద భిక్షమెత్తినా వచ్చిన సొమ్మును ఆ గుడి అవసరాలకే వినియోగిస్తా' అని చెప్పారు. గతంలో తమిళనాడులోని పలు ఆలయాల వద్ద భిక్షాటన చేశానని, ప్రస్తుతం శ్రీ బాలాత్రిపురసుందరీదేవి ఆలయ సమీపంలో ఉన్న నాగులపుట్ట వద్ద అర్చి నిర్మాణం చేయాలనే తలంపుతో ఉన్నానని, అందుకోసం భిక్షాటన కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు. ఇందుకు రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని, ఆ మొత్తం పోగు కాగానే అర్చిని నిర్మించి.. మరో ఆలయానికి వెళ్తానని చెప్పారు.

# ఈ-పంట.. వీఏఏలకు తంటా



అమరావతి, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): గ్రామ వ్యవసాయ, ఉ ద్యాన సహాయకు(వీఏఏ-వీహెచ్ఏ)లకు ఈ-పంట నమోదు సంకటం మారింది. జియో ఫెన్సింగ్ ద్వారా 20మీటర్ల దూరం నుంచి పొలాల్లోని పంటను ఫొటో తీసి, ఈ-పంట యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేయమనడంతో నానా తంటాలు పడుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో కాలువ చివరి భూములు, ఎత్తైన మెరక భూములు, వరి మాగాణుల్లో ఈ విధానం అమలు చేయడం కష్టమవుతోందని వీఏఏలు గగ్గోలుపెడుతున్నారు. వర్షాలు వరదలతో ఈ-పంట నమోదు నత్తనడక నడుస్తోంది. ఇటీవల వీఏఏలు, వీహెచ్ఏలు బదిలీలు కావడంతో కొత్త ప్రాంతాల్లో రైతుల వివరాలు తెలుసుకుని, నానా అవస్థలు పడుతూ క్షేత్ర స్థాయికి వెళ్లి, ఈ-పంట నమోదు చేస్తున్నారు. గతంలో జియోఫెన్సింగ్ విధానం 200మీటర్ల వరకు ఉండగా, కేంద్రం ఫొటో క్యాప్చర్‌ను కుదించింది. పంటకు 20మీటర్ల వరకు వెళ్తేనే పోర్టల్‌లో ఫొటో క్యాప్చర్ అవుతోంది. కనీసం 100మీటర్లయినా లేకపోవడంతో క్షేత్రస్థాయిలో మహిళా వీఏఏలు, వీహెచ్ఏలు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ప్రక్రియను ఈ నెల 30 లోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఉ న్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2.61కోట్ల ల్యాండ్ పార్సిల్స్ ఉండగా, ఇప్పటి వరకు 40శాతం కూడా పూర్తి కాలేదని సమాచారం. మరోవైపు రైతుసేవా కేంద్రాల్లో ఎరువుల అమ్మకాల బాధ్యత కూడా వీఏఏలకు అప్పగించారు. ఎరువులు అమ్మడం, ఆన్‌లైన్‌లో మార్క్‌ఫెడ్ ఖాతాలో సొమ్ము జమ చేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. ఇంకోవైపు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రైతులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసి, పరికరాలు అందజేయాల్సి ఉంది.ఏకకాలంలో ఇన్ని పనులు అప్పగించడంతో వీఏఏలు, వీహెచ్ఏలు భారంగా భావిస్తున్నారు. రాష్ట్రంలో 5,712మంది వీఏఏలు, 2,356మంది వీహెచ్ఏలు ఉన్నారు. వీరితో పాటు ఎంపీఈవోలు 1,369మంది, ఏఈవోలు 410మంది పని చేస్తున్నారు. ఒకరికొకరు సహకరించుకున్నా.. లక్ష్య సాధన కష్టతరంగా మారుతోందని వాపోతున్నారు. పని ఒత్తిళ్ల కారణంగా పలువురు అనారోగ్యం పాలుకావడం, ఒకరిద్దరు ఆత్మహత్యలు చేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. ఎరువుల పంపిణీని సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తే.. ఈ-పంట నమోదుతో పాటు రైతులకు సాంకేతిక సహకారాన్ని అందించడం సులువుగా ఉంటుందని వీఏఏలు, వీహెచ్ఏలు అంటున్నారు.

# సారా నిర్మూలనే లక్ష్యం : ఎక్సైజ్ సీఐ



కర్నూలు అర్బన్, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): సారా నిర్మూలనే లక్ష్యమని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. నగరంలోని బంగారుపేటలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పికెటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బాధితులకు సారావిముక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సారా విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకునే ఉద్దేశ్యంతో బంగారుపేట నిఘా ఉంచామన్నారు. సారా రహిత బంగారుపేట లక్ష్యమని తెలిపారు. సారా తయారీ, విక్రయమ మానితే ఉపాధి చూపుతామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రెహానబేగం, పోలీసులు పాల్గొన్నారు.

# ఐదుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

పలాస సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి మూ డు వేర్వేరు కేసుల్లో ఐదుగురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 84.81 కిలోల గంజాయి స్వాధీ నం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కా శీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ ఆదివారం విలేక రులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా గోయిబంద గ్రామానికి చెందిన గంట జైశ్వా, అదే జిల్లా సర్గిగూడ గ్రామానికి చెందిన స్వప్న బిబ్హార్ సహజీవనం చేస్తున్నారు. బిబ్హార్‌కి కోడలి వరుస అయిన రింకు బిబ్హార్ గంజాయి పండిస్తూ మహారాష్ట్రలోని షోలాపూర్ ప్రాంతంలో అమ్ముతుం టుంది. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో స్వప్న, జైశ్వాలకు గంజాయి తీసుకొని వెళ్లి షోలా పూర్‌లో ఉంటున్న మోహన్ రోహిదాస్‌కు ఇవ్వాల ని కోరింది. దీంతో 40.24 కిలోలు గంజాయి ప్యాకె ట్లు చేసి వారికి అప్పగించింది. దీన్ని తరలించేందు కు రూ.20వేలు ఇస్తామని చెప్పడంతో వారు గంజాయిని గుణుపూర్ నుంచి పలాస వరకూ బ స్సులో వచ్చి.. అక్కడి నుంచి పలాస రైల్వే స్టేషన్ కు వస్తుండగా తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ఆర్.నర్సిం హామూర్తికి తారాసపడ్డారు. బ్యాగులు పరిశీలించ గా గంజాయి బయట పడింది. దీంతో వారిద్దర్నీ అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.అదేవిధంగా తమిళనాడు రాష్ట్రం విజయరా ఘవపురం, చెన్నైకు చెందిన గాయత్రి అనీఫ్, సు భాష్ అన్నాచెల్లెలు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన మమతాకుమారి గంజాయి పండిస్తూ బ్రోకర్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది. మగవారు గంజాయి



తరలిస్తుంటే మన రాష్ట్రంలో నిరంతరం నిఘా ఉండడంతో ఆడవారితో గంజా యి రవాణాకు పథకం రచించారు. ఈ క్రమంలో అన్నా చెల్లెలు కలిసి 28.86 కిలోల గంజాయిని చెన్నై తరలించేందుకు పర్లాకిమిడి నుంచి పలాస వెళ్లే బస్సులో వచ్చారు. రాత్రి పలాస రై ల్వేస్టేషన్‌కు గంజాయితో వస్తుండగా కాశీబుగ్గ ఎస్ ఐ నర్సింహామూర్తికి వచ్చిన సమాచారం మేరకు ఇద్దర్నీ ప్రశ్నించడంతో గంజాయి బ్యాగులు బయట పడ్డాయి. వీరిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. వీరిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు.

# విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పాదులు

**తొలగించాలని ప్రజల వేడుకోలు**

మొగల్తూరు సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):మండలంలోని కొత్తలో 216 జాతీయ రహదారి పక్కన ఉన్న హై టెన్షన్ విద్యుత్ సరఫరా లైన్‌కు ఉన్న విద్యుత్ స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. పాదులు విద్యుత్ వైర్ల వరకు వెళ్లడంతో వర్షాలకు వర్షం కురిసిన సమయంలో విద్యుత్ షాకుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ప్రజాశక్తి విద్యుత్ శాఖ ఏఇ ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లగా పాదులను తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.



# అల్లర్లకు పాల్పడితే చర్యలు : సీఐ




కొలిమిగుండ్ల, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని ఎర్రగుడి గ్రామంలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్డన సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ గోపాల్, ఏఎస్‌లు బాబా ఫక్రుద్దీన, గోవింద నాయక్, పోలీసులు వీధుల్లో కవాతు నిర్వహించి, అనుమానస్పద ప్రదేశాలు, ఇళ్లలో తని ఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులకు సీఐ అవ గాహన సదస్సు నిర్వహించారు.

# ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్య...ర్యాగింగ్ కారణమా

సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):కాలేజీల్లో ర్యాగింగ్‌ను నిరోధించేందుకు కఠిన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, ఈ విషయం మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఓ యువ ఇంజినీరింగ్ విద్యార్థి, జాదవ్ సాయి తేజ, ర్యాగింగ్ ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అతని స్నేహితులు చెప్పిన వివరాల ప్రకారం ఈ దారుణ ఘటన వెనుక ర్యాగింగ్ ఉందని సూచిస్తున్నాయి.

వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నారపల్లిలో ఈ దుర్ఘటన జరిగింది. ఓ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న జాదవ్ సాయి తేజ్ (19) మధు బాయ్స్ హాస్టల్‌లో ఉరివేసుకుని మరణించాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన ఈ విద్యార్థి, సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్‌కు గురైనట్లు సమాచారం. సీనియర్లు అతన్ని మద్యం తాగమని ఒత్తిడి చేసి, బార్‌కు



తీసుకెళ్లారు. అక్కడ భారీ బిల్ వచ్చిన తర్వాత, బిల్ కట్టమని మరింత ఒత్తిడి చేశారు. ఈ ర్యాగింగ్ వల్ల తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్న సాయి తేజ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. మేడిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ర్యాగింగ్ కారణమా లేక వేరే కారణాలా అని పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కాలేజీల్లో భయం, ఒత్తిడి నుంచి విద్యార్థులను కాపాడేందుకు చట్టాలు పనిచేయడం లేదా? ఈ ఘటన విద్యార్థుల తల్లిదండ్రులను, కాలేజ్ యాజమాన్యాన్ని మళ్లీ ఆలోచింపజేస్తోంది.

# అమీన్‌పూర్ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగికి విద్యుత్ షాక్..

సంగారెడ్డి: సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): అమీన్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగికి విద్యుత్ షాక్ తగిలింది. పవర్ కట్ కారణంగా లైన్‌మెన్‌తో ఎల్సీ తీస్కొని కరెంట్ పోల్ ఎక్కాడు ఓకాంట్రాక్ట్ ఉద్యోగి. ఎల్సీ తీసుకున్న సమయంలో సడెన్‌గా పవర్ ఆన్ అయ్యింది. దీంతో పోల్‌పై ఉన్న ప్రకాష్ అనే వ్యక్తికి ఒక్కసారిగా.. విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మదీనగూడ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రకాష్ చికిత్స పొందుతున్నాడు.గత 5 ఏళ్లగా అమీన్‌పూర్ సబ్ స్టేషన్ పరిధిలో ప్రకాష్ అనే కాంట్రాక్ట్ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శ్రీవాని నగర్ వేదిరి టౌన్ షిప్‌లో నిలిచినపోయి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో భాగంగా విద్యుత్ స్తంభంపైకి



ఎక్కాడు. మరమత్తులు చేస్తుండగా విద్యత్ షాక్‌కు గురయ్యాడు. అయితే తమకు సంబంధం లేదని సబ్ స్టేషన్ సిబ్బంది చెప్తున్నట్లు ప్రకాష్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా.. కరెంట్ పోల్ ఎక్కాడని సిబ్బంది తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# తగ్గనున్న పాలు, నెయ్యి ధరలు



హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో పాలు, వెన్న, నెయ్యి ధరలు తగ్గనున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం సిఫారసుల మేరకు తెలంగాణ డెయిరీ డెవల్‌పమెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ (టీజీడీడీసీఎఫ్) పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపును అమల్లోకి తేనుంది. దీంతో నెయ్యి, వెన్న, పనీర్, యూహెచ్‌టీ పాల ధరలు గణనీయంగా తగ్గుతాయి. నెయ్యి, వెన్న, చీజ్, నమకిన్ ఉత్పత్తులపై ప్రస్తుతం ఉన్న జీఎస్టీ 12న్ని నుంచి ఐదు శాతానికి తగ్గించనున్నట్లు తెలిపింది. అలాగే ఇన్‌స్టంట్ మిక్స్‌లు, చాక్లెట్లు, కుకీలపై జీఎస్టీ 18న్ని నుంచి 5న్నికి తగ్గించనున్నట్లు టీజీడీడీసీఎఫ్ వెల్లడించింది. ఇక పనీర్, యూహెచ్‌టీ పాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ తగ్గింపు సోమవారం నుంచి మలులోకి వస్తుందని స్పష్టం చేసింది. డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లు కొత్త ధరలతో ఉత్పత్తులు విక్రయించాలని ఫెడరేషన్ ఆదేశాలు జారీ చేసింది.

# వాటర్ ట్యాంకులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

కరీంనగర్ క్రైం సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):కరీంనగర్ జిల్లా కేంద్రం శివారులోని ఓ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీ క్యూరింగ్ వాటర్ ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. స్థానిక బొమ్మకల్ రోడ్‌లో ఉన్న సత్యం సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో బిహార్‌కు చెందిన బిట్టు కుమార్ అయిదేళ్లుగా కూలీగా పనిచేస్తూ ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్డులో భార్య సుధాదేవి, ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. సాయంత్రం బయట ఆడుకుంటున్న వారి ఇద్దరు కుమారులు సత్యం కుమార్ (4), ఆర్యన్ కుమార్ (2) కనిపించకుండాపోయారు. ఫ్యాక్టరీ ఆవరణలో వెతికిన తల్లి సుధాదేవి వాటర్ ట్యాంక్‌లో ఆర్యన్ మృతదేహం నీటిపై తేలుతూ



కనిపించడం చూసి నిర్ఘాంతపోయింది. ఫ్యాక్టరీలోని కూలీలకు సమాచారం అందించగా వారు ఆర్యన్ మృతదేహాన్ని బయటకు తీశారు. నీటి లోపల వెతకగా సత్యం మృతదేహం కూడా అందులోనే ఉంది. చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హైడ్రా కూల్చివేతల్లో ఉద్రిక్తత.. ఎందుకంటే..

%హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): గాజులరామారంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఈ కూల్చివేతల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ సర్వే నెంబర్ – 307లో కూల్చివేతలు చేపట్టారు హైడ్రా అధికారులు. గాజులరామారం పరిధిలోని దేవేంద్రనగర్, బాలయ్య నగర్, హబీబ్ నగర్ కాలనీలో కూల్చివేతలు చేపట్టింది హైడ్రా.హబీబ్ నగర్‌లో కూల్చివేతలు చేపట్టిన సిబ్బందిపై ఎదురు దాడికి దిగారు బస్తీ వాసులు. బందోబస్తులో ఉన్న పోలీసులతో పాటు, కూల్చివేతలు చేపట్టిన హైడ్రా జేసీబీలపై రాళ్ల దాడి కురిపించారు బస్తీ వాసులు. రాళ్లదాడిలో పోలీసు అధికారితో పాటు, జేసీబీ అద్దాలు పగిలాయి. వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ దాడికి కారణమైన వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కూల్చివేతలు జరిగే ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. కాగా, గాజులరామారంలో హైడ్రా బిగ్ ఆపరేషన్ చేపట్టింది. సర్వే నెంబర్ – 307లో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేస్తుంది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కూల్చివేతలను అడ్డుకున్నారు స్థానికులు.




స్థానికులకు, హైడ్రా అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ ఇళ్లను కూల్చి వేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవేందర్ నగర్, బాలయ్య బస్తి, పోచమ్మ బస్తీలు వందలాది ఇళ్లను నేలమట్టం చేసింది హైడ్రా. ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలోకి తీసుకుంది హైడ్రా.

# స్నేహితుడి ఇంటికి కన్నం.. ఆడ వేషంలో డబ్బులు, నగదు స్వాహా




%హైదరాబాద్: సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): డబ్బులు సంపాదించాలనే ఆశతో.. మనుషులు మానవతా విలువలు మరిచిపోయి.. స్వార్థం, రాక్షసత్వానికి అలవాటు పడుతున్నారు. జల్సాలకు అలవాటు పడి అప్పులపాలు అవుతూ.. దొంగతనాలు, మోసాలు చేస్తున్నారు. డబ్బు కోసం మన, తన అనే తేడాలు లేకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. తాజాగా.. ఇలాంటి ఘటనే ఒకటి నగరంలో చోటుచేసుకుంది.

డబ్బు కోసం తన స్నేహితుడి ఇంటికే కన్నం వేశాడు ఓ మిత్రుడు. స్నేహితుడి ఇంట్లో బంగారం, డబ్బులు ఉన్నాయని తెలుసుకుని.. దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్, బంజారాహిల్స్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. ఉదయ్ నగర్‌కు చెందిన శివరాజ్ ఈ నెల 16వ తేదీన కుటుంబ సభ్యులతో నిజామాబాద్ వెళ్లాడు. ఊరికి వెళ్తున్న విషయాన్ని తన స్నేహితుడు హర్షిత్‌కు చెప్పాడు. అయితే అప్పటికే.. హర్షిత్ పూర్తిగా అప్పుల్లో మునిగిపోయి ఉండడంతో అదే అదునుగా భావించి.. శివరాజ్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. ఆడవేషంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. అనంతరం ఇంట్లో ఉన్న 6.75 తులాల బంగారం, రూ. 1.10 లక్షల నగదు తీసుకుని బయటపడ్డాడు. శివరాజ్ కుటుంబంతో ఇంటికి వచ్చినప్పుడు బంగారం, నగదు లేకపోవడంతో.. హుటాహుటిన పోలీసులకు సమాచారం ఇచ్చాడు.సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వివరాలను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. హర్షిత్ ఆడవేషంలో.. చోరీ చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు గుర్తించారు. వాటి ఆధారంగా హర్షిత్ చోరీకి పాల్పడ్డట్లు నిర్ధారణకు వచ్చినట్లు చెప్పారు. హర్షిత్‌ను అరెస్ట్ చేసి.. అతని వద్ద నుంచి 6.75 తులాల బంగారం, రూ. 85 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# విద్యార్థిపై గంజాయి బ్యాచ్ దాడి


**దారిలో అడ్డగించి డబ్బులివ్వాలని డిమాండ్**
**%ఇవ్వకపోవడంతో మూకుమ్మడి దాడి.. దెబ్బతిన్న ప్లీహం**
**మహబూబ్‌నగర్ జిల్లాలో ఘటన**
**4 రోజులైనా నిందితుల్ని అరెస్టు చేయని పోలీసులు**

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్):పాలమూరులో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి మత్తులో ఓ విద్యార్థిపై పిడిగుద్దులు కురిపించడంతో బాధితుడి ప్లీహము దెబ్బతింది. జిల్లాలోని భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు చెందిన రైతు చిన్న నర్సింహులు కుమారుడు సాయికుమార్(19) నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ గ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటాడు. 16న కాలేజీ నుంచి ముగ్గురుస్నేహితులతో కలిసి వెళుతుండగా అక్కడ గంజాయి తాగుతున్న ఐదారుగురు పోకిరీలు సాయికుమార్‌ను అడ్డుకొని డబ్బులు డిమాండ్ చేశారు. తన దగ్గర లేవని సాయి చెప్పడంతో రూ.40, రూ50 అయినా లేవా? అంటూ అతడిని ఇష్టానుసారంగా కొట్టారు. తీవ్రగాయాలైన సాయి, ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. వెంటనే వారు, అతడిని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్తస్రావం జరుగుతుండటంతో స్కానింగ్ చేయగా ప్లీహము పూర్తిగా దెబ్బతిన్నట్లు తేలింది. ఆపరేషన్ చేసి ప్లీహము తొలగించారు.



ప్రస్తుతం విద్యార్థి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. అయితే ప్లీహము నుంచే రోగనిరోధక శక్తి వస్తుందని, ఆ అవయవం లేకపోవడంతో ఏడాదికోసారి రోగనిరోధక శక్తి ఇంజెక్షన్, ప్రతి ఐదేళ్లకోసారి బూస్టర్ డోస్‌ను సాయికుమార్ తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఘటనపై అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులను అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం. దాడికి పాల్పడ్డ నిందితులు నేతల వద్ద పైరవీలు చేసుకుంటున్నారన్న ప్రచారం సాగుతోంది.

# ఆరోగ్యం క్షీణించింది.. మృత్యువుకు చేరువవుతున్నా



భువనగిరి టౌన్/హైదరాబాద్, సెప్టెంబర్ 22 (సందేశం టైమ్స్): రాజకీయవేత్తగా, ఆయుర్వేద ఆరోగ్య సేవికగా, ఆధ్యాత్మికవేత్తగా సాగిన తన జీవితం ముగియబోతోందని, ఆరోగ్యం క్షీణించిందని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చెందిన విశ్రాంత డీఎస్పీ నళిని ఆవేదన వ్యక్తంచేశారు. వీలునామా/మరణ వాంగ్మూలం పేరిట సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన బహిరంగ లేఖ సంచలనంగా మారింది. "ఎనిమిదేళ్ల క్రితం రుమటాయిడ్ ఆర్థరైటిస్(బ్లడ్, బోన్ క్యాన్సర్) సోకగా.. హరిద్వార్‌లోని రాందేవ్ బాబా పంచకర్మ కేంద్రానికి (నిరామయం) వెళ్లి బాగుచేసుకున్నాను. ఇప్పుడు నిరామయంలో చేరేంత డబ్బు లేదు. తెలంగాణ ఉద్యమ పోరాటంలో నిలువెల్లా గాయాలుకాగా, రాజీనామా ద్వారా నాటి ప్రభుత్వం పన్నిన పద్మవ్యూహంలోంచి బయటపడ్డాను. డిపార్ట్మెంట్ నా వెన్నులో సస్పెన్షన్ అనే బల్లాన్ని కసి తీరా దింపింది. మహర్షి దయానందుని దయతో యజ్ఞ బ్రహ్మగా వీవైపీఎస్ (వేద యజ్ఞ పరిరక్షణ సమితి)సంస్థాపకురాలుగా ఎదిగా. సీఎం రేవంత్‌రెడ్డి నాకు సహాయం చేస్తానని ప్రకటించారు. ఆ తర్వాత నా వినతిపత్రం చెత్త బుట్ట పాలైందని తెలిసింది. బతికుండగా నన్ను ఏ నాయకుడూ సన్మానించలేదు. నా దయనీయ స్థితి కేంద్రప్రభుత్వం దృష్టికి చేరితే సరైన, ఖరీదైన వైద్యం అందితే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడతానని ఆశాభావంతో ఉన్నా. నా పేరిట ఉన్న ఇంటి స్థలం వీవైపీఎసకు చెందుతుంది" అని నళిని పేర్కొన్నారు.




# క్రీడావార్తలు




## పాకిస్తాన్ మ్యాచ్‌లో అభిషేక్ , రౌఫ్ వాగ్వాదం వైరల్ వీడియో




దుబాయ్‌లో ఆదివారం జరిగిన ఆసియా కప్ మ్యాచ్‌లో భారత్ మరోసారి పాకిస్తాన్‌పై ఘన విజయం నమోదు చేసింది. ఈ క్రమంలోనే భారత ఓపెనర్ అభిషేక్ శర్మ, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారీస్ రౌఫ్‌త జరిగిన వాగ్వాదంపై మౌనం వీడాడు. అలాగే, ఈ మ్యాచ్‌లో భారత %u20×% వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కి కూడా సపోర్ట్ చేశాడు. ఈ ఉద్వేగభరిత మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అసలు ఏం జరిగిందో ఓసారి చూద్దాం.భారత్ %జం% పాకిస్థాన్ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. షహీన్ అఫ్రిదీ బౌలింగ్‌లో వరుసగా రెండు బౌండరీలు కొట్టిన శుభమన్ గిల్, అతని స్లెడ్జింగ్‌కు స్పందిస్తూ వెళ్లి బంతి తెచ్చుకో అంటూ వ్యంగ్యంగా చెప్పాడు. తర్వాత రౌఫ్ బౌలింగ్‌కు వచ్చినప్పుడు, తన బంతులతో భారత ఓపెనర్లను కవ్వించే ప్రయత్నం చేశాడు. ఓ దశలో అభిషేక్ శర్మ..హారిస్ రౌఫ్ ఒకరికొకరు వాగ్వాదం తీవ్రమవుతున్న సమయంలో అంపైర్లు వచ్చి పరిస్థితి నియంత్రణలోకి తెచ్చారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల్లోనూ భారత ఆటగాళ్లు సంయమనం కోల్పోకుండా లక్ష్యాన్ని ఈజీగా పూర్తి చేశారు.అభిషేక్ శర్మ తన బ్యాట్‌తో పాకిస్తాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 39 బంతుల్లో 74 పరుగులు చేసి, ఐదు సిక్సర్లు, ఆరు ఫోర్లతో మైదానాన్ని హోరెత్తించాడు. అతని విధ్వంసక ఇన్నింగ్స్ భారత్‌కు లక్ష్యాన్ని సులభంగా ఛేధించేందుకు దోహదపడింది. అభిషేక్‌తో పాటు శుభ్‌మన్ గిల్ కూడా ఓపెనింగ్‌లో అద్భుతంగా ఆడాడు. వీరిద్దరి భాగస్వామ్యం భారత్‌కు శుభారంభాన్ని అందించింది. ఈ ప్రదర్శనతో అభిషేక్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు.పాకిస్తాన్ ఆటగాళ్ల వైఖరి తనను మరింత పట్టుదలతో ఆడేలా ప్రేరేపించిందని మ్యాచ్ అనంతరం అభిషేక్ శర్మ తెలిపాడు. పాక్ ఆటగాళ్లు అనవసరంగా మాతో వాగ్వాదం చేశారని, అది తనకు అస్సలు నచ్చలేదన్నాడు. అందుకే మా జట్టును గెలిపించాలని మరింత కసితో ఆడినట్లు చెప్పాడు. తాను, శుభ్‌మన్ గిల్ స్కూల్ రోజుల నుంచి కలిసి ఆడుతున్నాం. మేము ఒకరికొకరు అనుబంధంతో బ్యాటింగ్ చేస్తాం. ఈ రోజు మా రోజు. గిల్ కూడా పాకిస్తాన్ ఆటగాళ్ల మాటలకు తన బ్యాట్‌తో సమాధానం ఇచ్చాడని, అది చాలా నచ్చిందని పేర్కొన్నాడు.

## పాకిస్తాన్‌పై మొదటి బంతికే అభిషేక్ శర్మ సిక్స్..సరికొత్త రికార్డు




భారత యువ ఆటగాడు అభిషేక్ శర్మ మరోసారి తన దూకుడు బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరిచాడు. సెప్టెంబర్ 21న దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఆరంభించిన అభిషేక్, తొలి బంతికే భారీ సిక్స్ కొట్టి చరిత్ర సృష్టించాడు.%పాకిస్తాన్ స్టార్ పేసర్ షాహీన్ షాహ్ అఫ్రిది వేసిన తొలి బంతినే అభిషేక్ మిడాన్ ఓవర్‌లో బౌండరీకి కొట్టి, అభిమానుల్లో మంచి జోష్ నింపాడు. ఇది కేవలం స్టైలిష్ షాట్ మాత్రమే కాదు, ఓ అరుదైన రికార్డు కూడా. ఒకే క్రికెటర్ భారత్ తరపున రెండు సార్లు టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో ఫస్ట్ బాల్‌కే సిక్స్ కొట్టిన తొలి ఆటగాడిగా అభిషేక్ శర్మ నిలిచాడు.ఇది తొలి సారి కాదు. సెప్టెంబర్ 10, 2025న యూఏఈపై మ్యాచ్‌లో కూడా అభిషేక్ శర్మ ఫస్ట్ బాల్‌కే సిక్స్ కొట్టాడు. అప్పుడు %ఖాజు% బౌలర్ హైదర్ అలీ వేసిన తొలి బంతిని దూకుడుగా స్టాండ్స్‌లోకి కొట్టాడు. ఇప్పుడు రెండోసారి షాహీన్ అఫ్రిది బౌలింగ్‌ను అదే విధంగా ఎదుర్కొన్నాడు. రెండు సందర్భాలూ భారత ఇన్నింగ్స్ ఛేజింగ్‌లోనే ఉన్నాయి.భారత టీ20 క్రికెట్ చరిత్రలో తొలి బంతికే సిక్స్ కొట్టిన ఆటగాళ్ల సంఖ్య కేవలం నలుగురు మాత్రమే. ఈ అరుదైన ఘనతను అభిషేక్ శర్మ రెండుసార్లు సాధించి మొదటి స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ (2021లో ఇంగ్లాండ్‌పై అడిల్ రషీద్ బౌలింగ్‌లో, అహ్మదాబాద్), యశస్వి జైస్వాల్ (2024లో జింబాబ్వేపై సికందర్ రజా బౌలింగ్‌లో, హరారే), సంజు శాంసన్ (2025లో ఇంగ్లాండ్‌పై జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో, ముంబయి), అభిషేక్ శర్మ (2025లో యూఏఈపై హైదర్ అలీ, దుబాయ్. పాకిస్తాన్‌పై షాహీన్ అఫ్రిది, దుబాయ్) జరిగింది.షాహీన్ అఫ్రిది తన కెరీర్‌లో 70 సార్లు టీ20 ఇంటర్నేషనల్స్‌లో తొలి ఓవర్ వేశాడు. కానీ ఇప్పటి వరకు ఎవరూ అతని బౌలింగ్ స్పెల్‌లో తొలి బంతికే సిక్స్ కొట్టలేదు. ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా అభిషేక్ శర్మ నిలిచాడు. ఇది ఆయన ధైర్యమైన ఆట శైలికి నిలువెత్తు సాక్ష్యమని క్రీడా వర్గాలు అంటున్నాయి. అభిషేక్ శర్మ ఆడే విధానం చూస్తుంటే యువరాజ్ సింగ్‌ను గుర్తుచేస్తోందని చెబుతున్నారు.

## ఈసారీ దంచేశారు భారత్ చేతిలో పాక్ చిత్తు





దుబాయ్: ఆసియాకప్ గ్రూప్ మ్యాచ్‌లోనే కాదు.. సూపర్-4లోనూ భారత జట్టు పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో దాయాది కాస్త పోటీనివ్వగలిగింది. ఫీల్డింగ్‌లో రెండు క్యాచ్‌లు వదిలేసిన ఓపెనర్ అభిషేక్ శర్మ (39 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 74) బ్యాటింగ్‌లో మాత్రం ప్రత్యర్థి బౌలర్లను కసిదీరా బాదాడు. అతడికి ఓపెనర్ గిల్ (28 బంతుల్లో 8 ఫోర్లతో 47) సహకరించడంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (58) అర్ధ సెంచరీ సాధించాడు. దూబేకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 174 పరుగులు చేసి గెలిచింది. తిలక్ (19 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30 నాటౌట్) అజేయంగా నిలిచాడు. హారీసకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు. కాగా, ఆసియా కప్‌నకు నేడు (సోమవారం) విరామం.ఓపెనర్ల శతక భాగస్వామ్యం: ఛేదనను భారత్ అదిరే రీతిలో ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్, గిల్ పాక్ బౌలర్లపై విరుచుకుపడడంతో స్కోరుబోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. షహీన్ వేసిన ఇన్నింగ్స్ తొలి బంతినే అభిషేక్ సిక్సర్‌గా మలిచాడు. స్పిన్నర్ అబ్రార్ ఓవర్‌లోనూ 4,6తో జోరు చూపాడు. మరోవైపు సయీమ్, షహీన్ ఓవర్లలో గిల్ రెండేసి ఫోర్లతో సహకరించాడు. వీరి ధాటికి పవర్‌ప్లేలో 69 పరుగులతో జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. అలాగే పేసర్లు షహీన్, రౌఫ్ వీరితో మాటల యుద్ధానికి దిగడం కనిపించింది. ఏడో ఓవర్‌లో అభిషేక్ క్యాచ్‌ను ఫర్హాన్ వదిలేయగా, ఓ ఫోర్‌తో 24 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే చక్కటి లెంగ్త్ బాల్‌తో గిల్‌ను పేసర్ అష్రాఫ్ బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో మూడు ఓవర్లలో సూర్య (0), జోరు మీదున్న అభిషేక్ కూడా అవుటవడంతో స్కోరు నెమ్మదించింది. ఈ దశలో తిలక్, శాంసన్ (13) రిస్కీ షాట్లకు వెళ్లకుండా సంయమనం కనబర్చారు. ఇక 12 బంతుల్లో 9 రన్స్ కావాల్సిన వేళ తిలక్ 19వ ఓవర్‌లో 6,4తో మ్యాచ్‌ను ముగించాడు.దూకుడుగా ఆరంభించినా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఈసారి ఆత్మవిశ్వాసంతో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో తొలి పది ఓవర్లలోనే 91 పరుగులు సాధించింది. అయితే భారత బౌలర్లు మధ్యఓవర్లలో కట్టడి చేయగలిగారు. ఓపెనర్ ఫర్హాన్ పేస్, స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగా.. అతడికి ఆరంభంలో సయీమ్ అయూబ్ (21) తోడ్పాటునందించాడు. దీనికి తోడు భారత ఫీల్డింగ్ వైఫల్యం కూడా వీరికి కలిసి వచ్చింది. తొలి ఓవర్‌లోనే ఫర్హాన్ క్యాచ్‌ను అభిషేక్.. ఐదో ఓవర్‌లో సయీమ్ క్యాచ్‌ను కుల్దీప్ వదిలేయడం దెబ్బతీసింది. అటు ఓపెనర్ ఫఖర్ జమాన్ (15)ను మూడో ఓవర్‌లోనే హార్దిక్ అవుట్ చేసినా.. ఫర్హాన్ ఎదురుదాడిని ఆపలేదు. ముఖ్యంగా స్టార్ పేసర్ బుమ్రాను సునాయాసంగా ఆడేయడంతో పవర్‌ప్లేలో జట్టు 55/1తో నిలిచింది. ఇందులో బుమ్రానే 34 పరుగులివ్వడం గమనార్హం. ఎనిమిదో ఓవర్‌లో ఫర్హాన్ క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర అభిషేక్ మరోసారి వదిలేయగా అది సిక్స్‌గా మారింది. ఫర్హాన్ 34 బంతుల్లో హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. చివరకు 11వ ఓవర్‌లో సయీమ్ క్యాచ్‌ను అభిషేక్ అందుకోవడంతో రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో దూబే, వరుణ్, కుల్దీప్ పాక్‌ను నియంత్రించడంతో 11-16 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా నమోదు కాలేదు. అలాగే హుస్సేన్ తలత్ (10)తో పాటు నిలకడగా ఆడుతున్న ఫర్హాన్ వికెట్‌ను కూడా కోల్పోయింది. కానీ చివరి మూడు ఓవర్లలో పాక్ 43 పరుగులతో 170 స్కోరును దాటించగలిగింది.పాకిస్థాన్: ఫర్హాన్ (సి) సూర్య (బి) దూబే 58, ఫఖర్ జమాన్ (సి) సంజూ (బి) హార్దిక్ 15, సయీమ్ (సి) అభిషేక్ (బి) దూబే 21, తలత్ (సి) వరుణ్ (బి) కుల్దీప్ 10, నవాజ్ (రనౌట్) 21, సల్మాన్ ఆఘా (నాటౌట) 17, ఫహీమ్ (నాటౌట్) 20, ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 20 ఓవర్లలో 171/5బీ వికెట్ల పతనం: 1-21, 2-93, 3-110, 4-115, 5-149బీ బౌలింగ్: హార్దిక్ 3-0-29-1, బుమ్రా 4-0-45-0, వరుణ్ 4-0-25-0, కుల్దీప్ 4-0-31-1, అక్షర్ 1-0-8-0, దూబే 4-0-33-2.

## ఫర్హాన్ గన్ ఫైరింగ్

హాఫ్ సెంచరీ చేసిన ఆనందంలో పాకిస్థాన్ ఓపెనర్ ఫర్హాన్ ప్రవర్తించిన తీరు నెట్టింట తీవ్ర విమర్శలపాలైంది. స్పిన్నర్ అక్షర్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి అర్ధ శతకం పూరించిన ఫర్హాన్.. గన్ ఫైరింగ్ చేస్తున్నట్టుగా సంబరాలు చేసుకున్నాడు. అయుతే కొద్ది నెలల కిందట పాకిస్థాన్ టెర్రరిస్టులు పహల్గామ్‌లో దాడి చేసి 26 మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్న నేపథ్యంలో..ఫర్హాన్ అలా తుపాకీ పేలుస్తున్నట్టు చేసిన సెలెబ్రేషన్‌పై నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంజేస్తున్నారు. తమ సోదరులు పహల్గామ్‌లో అలానే అమాయక ప్రజలను హతమార్చినట్టు ఫర్హాన్ చూపాడని నెటిజన్లు దుయ్యబడుతున్నారు.



## బీసీసీఐ అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్!



ముంబై: బీసీసీఐ తదుపరి అధ్యక్షుడెవరన్న ఉత్కంఠకు తెరపడింది. ఢిల్లీ జట్టు మాజీ కెప్టెన్ మిథున్ మన్హాస్ ప్రపంచ అత్యధిక ధనిక క్రికెట్ బోర్డు చీఫ్ కానున్నాడు. బీసీసీఐ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలుకు ఆదివారం మధ్యాహ్నంతో గడువు ముగిసింది. అయితే మన్హాస్ ఒక్కడే నామినేషన్ వేయడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. న్యూఢిల్లీలో శనివారం బీసీసీఐ పెద్దల సమావేశం జరిగింది. ఐసీసీ చీఫ్ జైషా, బీసీసీ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ఢిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ తదితరులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సమావేశంలో మిథున్ పేరును ఖరారుచేసినట్టు సమాచారం. ఆ మేరకు అతడు నామినేషన్ దాఖలు చేశాడు.. ఇక..వచ్చే ఆదివారం ముంబైలో జరిగే బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశం సందర్భంగా బోర్డులో మిగిలిన మరికొన్ని కీలక పదవులను కూడా భర్తీ చేస్తారట. భారత మాజీ ఆటగాడు, కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు రఘురామ్ భట్ బోర్డు చీఫ్ పదవికి చివరి నిమిషం వరకూ పోటీపడ్డాడు. కానీ బోర్డు పెద్దలు నచ్చజెప్పడంతో అతడు రేస్‌నుంచి వైదొలగినట్టు సమాచారం. దాంతో రఘురామ్ భట్ బీసీసీఐ కోశా?ధికారి పదవికి నామినేషన్ వేశాడు. దేవజీత్ సైకియా కార్యదర్శిగా కొనసాగనున్నాడు.

## సాత్విక్ జోడీకి రజతమే



షెన్‌జన్: భారత టాప్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టికి వరుసగా రెండో ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. గతవారం హాంకాంగ్ ఓపెన్ తుది పోరులో ఓడిన సాత్విక్ జోడీ.. ఆదివారం జరిగిన చైనా మాస్టర్స్‌లో వరల్డ్ నెం:1 జోడీ కిమ్ వోన్ హెూ-సియో సియింగ్ సొ చేతిలో పరాజయం పాలయ్యారు. సాత్విక్-చిరాగ్ ద్వయం 19-21, 15-21తో కొరియాకు చెందిన కిమ్-సియో చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. తొలి గేమ్ ఆరంభంలో ఇద్దరూ నువ్వానేనా? అన్నట్టుగా తలపడినా 6-7 వద్ద వరుసగా 8 పాయింట్లు సాధించిన భారత షట్లర్లు 14-7తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. కానీ, వరుస తప్పిదాలతో ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం ఇవ్వడంతో గెలవాల్సిన గేమ్ చేజారింది. ఇక, రెండో గేమ్‌లో సాత్విక్ ద్వయం 9-7తో ముందంజలో నిలిచినా.. కొరియా జంట 10-10తో స్కోరు సమం చేసింది. ఈ దశలో తడబడిన సాత్విక్-చిరాగ్ 11-15తో వెనుకబడ్డారు. అయితే, ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా కిమ్ జోడీ మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

# బిజినెస్



## స్వల్ప నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు (సెప్టెంబర్ 22, 2025) నష్టాలతో ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 150 పాయింట్లు పడిపోయి 82,151 స్థాయిలో ఉండగా, నిఫ్టీ 89 పాయింట్లు తగ్గి 25,238 పరిధిలో ట్రేడ్ అవుతోంది. అమెరికా కొత్తగా హెచ్-1బీ వీసాలకు %వి%100,000 ఒకేసారి ఫీజు విధించడంతో భారత ఐటీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ప్రధానంగా టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్ఎస్ఎల్ టెక్నాలజీస్ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి.ఇదే సమయంలో %ాదీ×% లైఫ్ ఇన్సురెన్స్, హీరో మోటో కార్పొరేషన్, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, హిందాల్కో వంటి కంపెనీల షేర్లు టాప్ 5 లాభాల్లో ఉన్నాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ సూచీ 3% పడిపోయింది. మిడ్‌స్మాల్ ఐటీ, టెలికాం రంగాలు 1.75% తగ్గాయి. ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీలు స్వల్ప నష్టాల్లో ఉన్నాయి.ఆటో, మీడియా, మెటల్ రంగాలు లాభాల్లో ఉన్నాయి.అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ తర్వాత ఆసియా స్టాక్ మార్కెట్లు పాజిటివ్ సెంటిమెంట్‌తో పెరిగాయి. రాబోయే ఆసియా ఆర్థిక సహకార సదస్సు సందర్భంగా జిన్‌పింగ్‌ను కలుస్తానని ట్రంప్ అన్నారు. బ్యాంక్ ఆఫ్ జపాన్ (%దీూజీ%) తన ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్ హోల్డింగ్‌లను విక్రయించే ప్రణాళికలను వెల్లడించిన తర్వాత జపాన్ నిక్కీ 1.4 శాతం పెరిగింది.ఇదే సమయంలో దక్షిణ కొరియా కోస్పి 0.9 శాతం పెరిగింది.




వడ్డీ రేటు కోతల అంచనాల మధ్య శుక్రవారం వాల్ స్ట్రీట్ స్టాక్ మార్కెట్లు లాభపడ్డాయి. %ూడూ% 500 ఇండెక్స్, నాస్‌డాక్ వరుసగా 0.49 శాతం, 0.72 శాతం పెరిగాయి.మెయిన్‌బోర్డ్ విభాగంలో %అఝశ్రీబవ% ఇన్ఫోసొల్యూషన్స్ ఇష్యూ ఈరోజు ముగుస్తుంది. %+ఖ% ఎనర్జీ, సాత్విక్ గ్రీన్ ఎనర్జీ %×ూూ%లు రెండో రోజులోకి ప్రవేశిస్తాయి. అట్లాంటా ఎలక్ట్రికల్స్, గణేష్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఇష్యూలు ఈరోజు సబ్‌స్క్రిప్షన్ కోసం రాబోతున్నాయి. %ూవీజు% విభాగంలో టెక్‌డి సైబర్ సెక్యూరిటీ లిస్టింగ్‌తో సహా నాలుగు ఇష్యూలు ఈరోజు సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉన్నాయి.

## స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..మీ నగరంలో రేట్లు ఇలా




దేశంలో బంగారం, వెండి ధరలు ఎల్లప్పుడూ మార్కెట్‌లో హాట్ టాపిక్‌గా ఉంటాయి. నిన్నటితో పోల్చుకుంటే ఈరోజు ఉదయం నాటికి వీటి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో నేడు (సెప్టెంబర్ 22, 2025) ఉదయం 6:15 గంటల నాటికి, హైదరాబాద్, ముంబైలో 24 క్యారెట్ బంగారం 10 గ్రాములకు రూ.10 తగ్గి రూ.1,12,140కి చేరగా, 22 క్యారెట్ 10 గ్రాములకు రూ.1,02,790కి చేరింది. మరోవైపు వెండి కిలో ధర హైదరాబాద్, కేరళలో రూ.100 తగ్గి రూ.1,34,900కు చేరుకుంది. ఇదే సమయంలో ఇతర నగరాల్లో వీటి ధరలు ఎలా ఉన్నాయెూ ఇక్కడ చూద్దాం.భారతదేశంలోని వివిధ నగరాల్లో గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం 24 క్యారెట్ బంగారం (10 గ్రాముల) ధరలు ఇలా ఉన్నాయి. ఢిల్లీలో రూ.1,12,290, చెన్నైలో రూ.1,12,250, కోల్‌కతా, పూణేలో రూ.1,12,140, బెంగళూరు, వడోదరలో రూ.1,12,140. ఇక వెండి ధరల విషయానికొస్తే, బెంగళూరులో ఒక కిలోకు రూ.1,33,500గా ఉంది. హైదరాబాద్, చెన్నై, కేరళలో రూ.1,44,900గా, ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, పూణే, వడోదరలో రూ.1,34,900గా ఉన్నాయి.ఈ ధరలు నగరాలను బట్టి మారుతున్నాయి. బంగారం ధరలు ఢిల్లీలో అత్యధికంగా, కోల్‌కతా, పూణే, బెంగళూరు, వడోదరలో కొంచెం తక్కువగా ఉన్నాయి. వెండి ధరలు హైదరాబాద్, చెన్నై, కేరళలో ఎక్కువగా, బెంగళూరులో తక్కువగా ఉన్నాయి. ఈ ధరలు మార్కెట్ పరిస్థితులను బట్టి ఎప్పటికప్పుడు మారుతుంటాయి.దసరా, దీపావళి సీజన్ సమీపిస్తుండగా బంగారం పట్ల ఆకర్షణ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు మరింత పెరుగుతాయని, ఇదే సమయంలో ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సంప్రదాయం, సంస్కృతి, పెట్టుబడి వంటి సందర్భాలలో బంగారానికి ఎల్లప్పుడు డిమాండ్ ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో బంగారం కొనుగోలు కేవలం ఆభరణాల కోసం మాత్రమే కాక, ఆర్థిక భద్రత కోసం కూడా ఉపయోగపడుతుంది.

## అండమాన్ సముద్రంలో చమురు నిక్షేపాలు




### అన్వేషణ కోసం రూ.3,200 కోట్ల కేటాయింపు
### మరో మూడు ప్రాంతాల్లో కూడా
### ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు అనుమతి

న్యూఢిల్లీ: చమురు దిగుమతుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం దేశంలోనే చమురు, గ్యాస్ ఉత్పత్తి పెంచేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్).. తొలి దశలో అండమాన్, నికోబార్ ద్వీపాల్లోని లోతట్టు సముద్ర జలా లు సహా మహానది, సౌరాష్ట్ర, బెంగాల్ బేసిన్స్‌లో చమురు, సహజ వాయువు నిక్షేపాల కోసం వచ్చే ఏడాది కొన్ని కొత్త బావులు తవ్వబోతున్నాయి. కాగా అండమాన్‌కు దగ్గరలో ఉన్న మయన్మార్, ఇండోనేషియా సముద్ర జలాల్లో ఇప్పటికే పెద్దమొత్తంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. అండమాన్ సముద్ర జలాల్లోని భూప్రాంతం కూడా మయన్మార్, ఇండోనేషియా సముద్ర భూతలాన్ని పోలి ఉంటుంది. దీంతో మన ప్రాంతంలో నూ భారీగా చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతాల్లో చమురు అన్వేషణ కోసం రూ.3,200 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.అండమాన్‌లో 37.1 కోట్ల టన్నుల నిక్షేపాలు: అండమాన్ ప్రాంతంలో భారత ఇంధన ముఖ చిత్రాన్నే మార్చివేసే భారీ చమురు, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల ప్రకటించారు. ఈ నిక్షేపాలు 31.7 కోట్ల టన్నుల వరకు ఉంటాయని ఇప్పటికే అంచనాలు వినిపిస్తున్నాయి. ఇది గత ఏడాది మన దేశం దిగుమతి చేసుకున్న 24.24 కోట్ల టన్నుల కంటే ఇది 7.46 కోట్ల టన్నులు ఎక్కువ. చమురు, గ్యాస్ అన్వేషణకు వీలుగా 2022లో కేంద్ర ప్రభుత్వం అండమాన్ సముద్ర ప్రాంతంలోని దాదాపు 10 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని స్వేచ్ఛా మండలంగా ప్రకటించింది.బీపీ భాగస్వామ్యం: అండమాన్ సముద్ర జలాల్లో ఎక్కడ బావులు తవ్వాలి? వాటి ఫలితాల అన్వేషణలో బ్రిటిష్ పెట్రోలియం (బీపీ).. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు సహకరిస్తుంది. ఈ పరీక్షా ఫలితాల ఆధారంగా ఈ ప్రాంతంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి హక్కులు ఏ కంపెనీకి ఇవ్వాలనే విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. పరీక్షా ఫలితాలు ఆశాజనకంగా ఉంటే, అందులో బీపీ కంపెనీ కూడా వాటాదారుగా చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే పర్యావరణ అనుమతులు, భారీ ఖర్చులు ఇందుకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం స్వల్ప ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి పెరుగుతుండటమే ఇందుకు కారణం. అయితే జీఎస్‌టీ సంస్కరణల నేపథ్యంలో సానుకూల సెంటిమెంట్ నెలకొని సంబంధిత రంగాల షేర్లు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మైనింగ్, ఆటోమొబైల్, నాన్ ఫెర్రస్ మెటల్స్, ఎలక్ట్రికల్స్, ఐరన్ అండ్ స్టీల్ రంగాలు బలంగా ఉన్నాయి.భారతి ఎయిర్‌టెల్: జీవితకాల గరిష్ఠాన్ని చేరిన తర్వాత ఈ కౌంటర్‌లో స్వల్ప దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం మూమెంటమ్ గణనీయం గా పెరిగింది. పైగా షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,962 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,950 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,025/2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.1,930 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.యూనియన్ బ్యాంక్: గరిష్ఠ స్థాయిని చేరుకున్న తర్వాత ఈ కౌంటర్‌లో దిద్దుబాటు జరిగింది. ప్రస్తుతం మూమెంటమ్, వాల్యూమ్, రిలేటివ్ స్ట్రెంత్ గణనీయంగా పెరిగాయి. పైగా పీఎసయూ బ్యాంకింగ్ రంగం జోరందుకుంటోంది. గత శుక్రవారం రూ.140 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.130 శ్రేణిలో ప్రవేశించి రూ.155 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. అయితే రూ.131 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్ గా పెట్టుకోవాలి.గోద్రెజ్ ప్రాపర్టీస్: జీఎసటీ సంస్కరణల నేపథ్యంలో రియల్టీపై ఫోకస్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ షేరుపై మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ పెరుగుతండటం గమనార్హం. గత శుక్రవారం రూ.2,145 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,080 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,145 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.2,050 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.బీపీసీఎల్: ఈ ఏడాది జూలైలో రూ.355 వద్ద గరిష్ఠ స్థాయిని తాకిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. అన్ని రకాల కాల వ్యవధుల్లో మూమెంటమ్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.329 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.320 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.380 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.300 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.

## కోల్ ఇండియా సారథిగా సాయిరామ్

%న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండి యా లిమిటెడ్ (సీఐఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బీ. సాయిరామ్ ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల అధిపతుల ఎంపిక బోర్డు (పీఈఎసబీ) ఈ పదవికి ఆయన పేరును సిఫారసు చేసింది. మరో 10 మంది నుంచి గట్టి పోటీ ఎదుర్కొని మౌఖిక పరీక్షలో అందరి కన్నా ముందు వరుసలో సాయిరామ్ నిలిచారు. ప్రస్తుతం సీఐఎల్‌కు సారథ్యం వహిస్తున్న పీఎం ప్రసాద్ అక్టోబరు 31వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. లాంఛనాలు పూర్తయిన తర్వాత ఆయన స్థానంలో సాయిరామ్ బాధ్యతలు చేపట్టనున్నారు. విశాఖపట్నానికి చెందిన సాయిరామ్ తన 34 ఏళ్ల సుదీర్ఘ సర్వీసులో సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్‌లో టెక్నికల్ డైరెక్టర్ సహా ఎన్నో కీలక పదవులు నిర్వహించారు.



ప్రస్తుతం నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ సీఎండీగా పని చేస్తున్నారు. ఆయనకు బొగ్గు రంగంలో అపారమైన అనుభవం ఉంది.

## హెటెరో నుంచి క్యాన్సర్ ఔషధం

హెటెరో హెల్త్‌కేర్ లిమిటెడ్ మరో సరికొత్త ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. 'పెర్జియా' పేరుతో విడుదల చేసిన ఈ ఔషధం రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఉపయోగపడుతుందని తెలిపింది. ఆల్కెమ్ లేబొరేటరీస్ అనుబంధ బయోటెక్నాలజీ సంస్థ ఎంజీన్ బయోసైన్సెస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసినట్లు హెటెరో వెల్లడించింది. అంకాలజీ థెరపీల్లో నాణ్యమైన ఔషధాలను అందుబాటు ధరల్లో తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ ఔషధాన్ని తీసుకువచ్చినట్లు హెటెరో తెలిపింది.




TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006